మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 25-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 || సంచిక: 26 Issue: 26

25 జూలై 2026 - శనివారం, శ్రీ పరాభవ నామ సంవత్సరం, దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు, ఆషాడ మాసం - శుక్లపక్షం, సూర్యోదయం - తె. 5:57, సూర్యాస్తమయం - సా. 6:48, తిథి, ఏకాదశి ఉ. 11:34 వరకు, తరువాత ద్వాదశి, సంస్కృత వారం, స్థిర వాసరః, నక్షత్రం, జ్యేష్ఠ ఉ. 7:27o వరకు, యోగంబ్రహ్మ రా. 8:59 వరకు కరణం, విష్టి ఉ. 11:34 వరకు, బవ రా. 12:46o వరకు, వర్జ్యం, ఉ. 10:54 నుండి మ. 12:42 వరకు, దుర్ముహూర్తం, ఉ. 7:40 నుండి ఉ. 8:31 వరకు, రాహుకాలం, ఉ. 9:09 నుండి ఉ. 10:46 వరకు, యమగండం, మ. 1:59 నుండి మ. 3:35 వరకు, గుళికాకాలం, తె. 5:57 నుండి ఉ. 7:33 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 4:21 నుండి తె. 5:09 వరకు, అమృత ఘడియలు, రా. 9:40 నుండి రా. 11:28 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు, గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana


## ధర్మేంద్ర రాజీనామా చేస్తేనే..!

### ఆందోళన విరమిస్తామన్న సీజేపీ



న్యూఢిల్లీ: ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు విరమించే ప్రసక్తే లేదని సీజేపీ నేతలు అశుతోష్ రాంకా, అభిజీత్ దీప్కే తేల్చి చెప్పారు. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషిని బదిలీ చేసి, కీలక విభాగాల్లో కొత్త అధికారులను నియమించింది. మరోవైపు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇతర విద్యా సంబంధిత అంశాలపై సోషల్ మీడియాలో చురుకుగా వ్యవహరిస్తూనే, పేపర్ లీక్‌లకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను షేర్ చేస్తున్నారు కాగా, విద్యార్థుల సమస్యలు, పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారాలపై డిమాండ్ చేస్తూ ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగుక్ చేపట్టిన నిరాహార దీక్ష 26 రోజుల తర్వాత ముగిసింది. అర్ధరాత్రి

- తరువాయి 2 వ పేజీలో...

## ..అట్లైట్ల గడువు కావాలి!

### శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరిన కేంద్రం

### కేంద్ర మంత్రి రాజీనామాకు పట్టుబడుతున్న సీజేపీ

### కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం సూత్రప్రాయ అంగీకారం

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనలు ఉద్ధృతం చేసినప్పటికీ, ఆయన రాజీనామాకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదని తెలుస్తోంది. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. 'రాజీనామా చేయడం చాలా తేలికైన

- తరువాయి 2 వ పేజీలో...




## ఎన్‌టీఏలో ప్రక్షాళన.. 47 మందిపై వేటు

### అవుట్‌సోర్సింగ్ విధానంలోనూ సంస్కరణలు

### నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు మార్పులకు సన్నాహాలు

న్యూఢిల్లీ: నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రక్షాళన దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సంస్థ విశ్వసనీయతను పునరుద్ధరించే లక్ష్యంతో ఎన్‌టీఏలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే సుమారు 47 మంది అధికారులను విధుల నుంచి తొలగించింది. రాబోయే నెల రోజుల్లో ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పూర్తికానున్నట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో భవిష్యత్తులో ఎలాంటి లీకేజీలకు, అవకతవకలకు తావులేకుండా అత్యంత పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే తొలగించిన 47 మంది అధికారులతో పాటు

- తరువాయి 2 వ పేజీలో...






## రాజ్యసభ ముందుకు వందేమాతరం బిల్లు

### విపక్షాల ఆందోళన

న్యూఢిల్లీ: పార్లమెంట్ వేదికగా మరో కీలక బిల్లుపై రగడ మొదలైంది. దేశభక్తి గేయమైన వందేమాతరం గౌరవాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన వందేమాతరం బిల్లును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ శుక్రవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం వందేమాతరాన్ని అవమానించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టం రూపకల్పన చేశారు. వందేమాతరం

- తరువాయి 2 వ పేజీలో...



## పేపర్ లీక్ చేస్తే పదేళ్ల జైలు

### రూ.10కోట్ల జరిమానా కూడా.. కేంద్ర ఉద్యోగులకు 2% డీఏ పెంపు

### ఈ ఏడాది జనవరి 1 నుంచే అమలు.. కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

*పేపర్ లీక్‌లకు పాల్పడిన వ్యక్తులకు పదేళ్ల జైలుశిక్ష, రూ.పది కోట్ల జరిమానా విధించేందుకు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్టులో సవరణలు చేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. పేపర్ లీకేజీ కేసుల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు కేవలం మూడు నెలల్లో తీర్పును వెలువరించాలని ఈ చట్టంలో పొందుపరుచనున్నారు.*

న్యూఢిల్లీ: సవరణలు చేసిన బిల్లుకు కేబినెట్ ఆమోదం నేపథ్యంలో..అంతకుముందు ప్రధాని మోదీ ప్రకటించినట్లుగా ఆ బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. శుక్రవారం ప్రధాని మోదీ వేదికగా కేంద్ర కేబినెట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కీలక భేటీ నిర్వహించింది. కేబినెట్ భేటీలో పేపర్ లీకేజీ కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుతో పాటు జైలుశిక్ష, జరిమానా విషయాల్లో

- తరువాయి 2 వ పేజీలో...

## 18 మంది నుజ్జు నుజ్జు

### కొండ చరియలు పడి దుర్మరణం

### హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర విషాదం



హిమాచల్ ప్రదేశ్‌లోని మారుమూల లాహౌల్-స్పితి జిల్లాలో శుక్రవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో ఓ టాటా సుమో వాహనం నుజ్జునుజ్జయింది.

సిమ్లా: ఈ ప్రమాదంలో 13 మంది ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆ వాహనం కుల్లు నుంచి పంగికి ప్రయాణిస్తోంది. ఉదయ్‌పూర్-కిల్లార్ రహదారిలోని కదు నల్లా సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. అంతకుముందు రోజు కొండచరియలు విరిగిపడటంతో అధికారులు ఈ మార్గాన్ని మూసివేశారు. దీంతో ప్రయాణికులతో ఉన్న ఆ

- తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,433 |
| వెండి (కిలో): | రూ.2,40,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,129 |

## విశ్వవాణి



విటమిన్ బీ3 రూపమైన నికోటినమైడ్‌తో పాటు గ్రీన్ టీలో లభించే ఎపిగాలోకాటెకిన్ గాలేట్ సమ్మేళనం నాడీకణాల పనితీరును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ రెండు సమ్మేళనాలు కలిసి నాడీకణాల్లో గ్వానోసిన్ ట్రైఫాస్ఫేట్ అనే కీలక శక్తి అణువు స్థాయిలను పునరుద్ధరిస్తాయి. దీంతో కణాలకు అవసరమైన శక్తి అందడంతో అవి సాధారణంగా పనిచేయడమే కాకుండా, మెదడులో పేరుకుపోయే హానికర ప్రోటీన్లను తొలగించే సామర్థ్యాన్ని కూడా పెంచుకుంటాయి.

## రాజ్యమా.. ఉలికిపడు!

### విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వాలే కూలిపోతాయి




నీట్ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారం, ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యలకు నిరసనగా బీఆర్ఎస్ శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నాచౌక్‌లో నిరసన చేపట్టింది. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) పిలుపుతో నిర్వహిం చిన ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు, యువకులు హాజరయ్యారు.

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నీట్ వ్యవహారంపై బీఆర్ఎస్ భారీ ధర్నా
- జన్మదిన వేడుకలు రద్దు చేసుకొని కేటీఆర్ హాజరు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- విద్యార్థులకు అండగా ఉంటామని హామీ

హైదరాబాద్, జూలై 24 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన జన్మదిన వేడుకలను రద్దు చేసుకుని నల్లచొక్కా ధరించి ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న నీట్ పేపర్ లీక్‌కి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యార్థులు ప్రభుత్వాన్ని కూల్చాలనుకోవడం లేదని, తమకు జరిగిన

- తరువాయి 2 వ పేజీలో...

## నీట్ అల్లర్ల వెనుక కమ్యూనిస్టులు

### విదేశీ శక్తుల హస్తం కూడా ఉంది

### కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపణలు

ఢిల్లీలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని స్పష్టం చేశారు. నీట్ ఆందోళనల ముసుగులో దేశంలో అరాచకాలు సృష్టించేందుకు కొన్ని కుట్ర శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఎండగట్టారు.





హైదరాబాద్, జూలై 24 (ఈవార్తలు): నీట్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల కలలు, తల్లిదండ్రుల ఆశలతో ముడిపడి ఉన్న అంశమని, ఈ ఘటనపై ప్రధాని మోదీ తీవ్రంగా కలత చెందారని బండి సంజయ్ తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశామని, ఇప్పటికే సీబీఐ విచారణ వేగవంతం చేసి 11 మంది ఫ్యాకల్టీ సహా మొత్తం

- తరువాయి 2 వ పేజీలో...

## 892 పల్లెలకు నీటి కటకట

### 23 జిల్లాల్లో వర్షాభావం.. 39 మండలాల్లో తీవ్ర పరిస్థితి

తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్



తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వర్షాభావం ఎక్కువగా ఉండే 892 గ్రామాలను అత్యంత సున్నిత ప్రాంతాలుగా గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించింది. ఈ గ్రామాల్లో వర్షాభావం, భూగర్భ జలాల క్షీణత, సాగునీటి కొరత, పంటల నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టనున్నారు.

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమీక్షలో.. గ్రామాల వారీగా ప్రత్యేక అధికారులు నియమించి రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులపై నిరంతర అవగాహన కల్పించాలని నిర్ణయించారు.



## రాశి ఫలాలు

25-7-2026

మేషం: కొన్ని కార్యక్రమాలు వాయిదా పడతాయి. దూరప్రయాణాలు చెయ్యవలసిన వస్తుంది. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. సంతాన ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. మిత్రులతో చిన్నపాటి విభేదాలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు తప్పవు.

వృషభం: ప్రయాణాలలో మార్గావరోధాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో తొందరపాటు మంచిదికాదు. ప్రత్యర్థుల నుంచి ధన పరంగా ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపారాలు సాదాసీదాగా ఉంటాయి. ఉద్యోగాలలో ఊహించని స్థానచలనాలు కలుగుతాయి. దైవ సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

మిధునం: దూరప్రాంతాల బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పురోగతి కలుగుతుంది. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. చేపట్టిన పనులు సజావుగా పూర్తి చేస్తారు. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహవంతంగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

కర్కాటకం: ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. నూతన ఋణ యత్నాలు చేస్తారు. బంధువులతో అకారణ విభేదాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాల్లో ఆకస్మిక మార్పులు చికాకు పరుస్తాయి. మానసిక ప్రశాంతతకు ఆలయ దర్శనాలు చేసుకుంటారు. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి.

సింహం: ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత విషయాలు చర్చిస్తారు. నూతన పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తొలగుతాయి.

కన్య: వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ముఖ్యమైన పనులు కొన్ని వాయిదా వేస్తారు. మిత్రులతో కలహ సూచనలున్నవి. వ్యాపారాలు నిరాశాజనకంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు పెరుగుతాయి.

తుల: వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. రాజకీయ సభ, సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి. మొండి బాకీలు వసూలవుతాయి. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి.

వృశ్చికం: నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుని విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాల్లో పదోన్నతులు పెరుగుతాయి. వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు.

ధనస్సు: కుటుంబ వాతావరణం చికాకుగా ఉంటుంది. ప్రయాణాలు వాయిదా పడుతాయి. ముఖ్యమైన పనులలో కార్యాటంకములు కలుగుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఉద్యోగులకు అదనపు పని బాధ్యతలు పెరుగుతాయి.

మకరం: వ్యయప్రయాసలతో కానీ పనులు పూర్తి కావు. చేపట్టిన పనుల్లో ఆటంకాలు కలుగుతాయి. భాగస్వామ్య వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగులకు అధికారుల నుండి విమర్శలు తప్పవు. వృథా ఖర్చులు పెరుగుతాయి. దైవ సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

కుంభం: ముఖ్యమైన కార్యక్రమాల్లో విజయం సాధిస్తారు. కీలక సమయంలో సన్నిహితుల సహాయం అందుతుంది. జీవిత భాగస్వామి నుంచి ఆకస్మిక ధనలాభలు పొందుతారు. నిరుద్యోగులకు నూతన అవకాశములు లభిస్తాయి. వృత్తి, వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి.

మీనం: నిరుద్యోగులకు అందిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. విందువినోదాది కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో అధిక లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు.

# 892 పల్లెలకు నీటి కటకట



హైదరాబాద్, జూలై 24 (ఈవార్తలు): తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యం లో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వర్షా భావం ఎక్కువగా ఉండే 892 గ్రామాలను అత్యంత సున్నిత ప్రాంతాలుగా గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నిర్ణయిం చింది. ఈ గ్రామాల్లో వర్షాభావం, భూగర్భ జలాల క్షీణత, సాగునీటి కొరత, పంటల నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టనున్నారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమీక్షలో.. గ్రామాల వారీగా ప్రత్యేక అధికారులు నియమించి రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులపై నిరంతర అవగాహన కల్పించాలని నిర్ణయించారు.రాష్ట్రంలోని 23 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. మొత్తం 621 మండలాల్లో 360 మండలాలు వర్షాభావ పరిస్థితుల్లో ఉండగా.. 39 మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా సాధారణంతో పోలిస్తే 24 శాతం వర్షపాతం లోటు నమోదైంది. మేడ్చల్–మల్కాజిగిరి, హైదరాబాద్, హనుమకొండ, వరంగల్, యాదాద్రి భువనగిరి, జనగామ, కరీంనగర్ జిల్లాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని అధికారులు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ వానా కాలంలో మొత్తం సాగు విస్తీర్ణం 1.39 కోట్ల ఎకరాల నుంచి 1.07 కోట్ల ఎకరాలకు పడిపోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ముఖ్యంగా వరి సాగు 69.89 లక్షల ఎకరాల నుంచి 38.51 లక్షల ఎకరాలకు తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో సుమారు 32.20 లక్షల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొక్కజొన్న, కంది, మినుము, పెసర, జొన్న, చిరుధాన్యాలు, కూరగాయలు, నూనెగింజలు, ఉద్యాన పంటలను ప్రోత్సహించనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షాభావం నమోదైన 892 గ్రామాల్లో అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 189 గ్రామాలు ఉన్నాయి. ఆ తర్వాత కుమురం భీం ఆసిఫాబాద్‌లో 151.. వనపర్తిలో 89, మహబూబాబాద్‌లో 72, జనగామలో 72, హనుమకొండలో 69 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో ప్రతిరోజూ వర్షపాతం, భూగర్భ జలాలు, పంటల పరిస్థితిని అధికారులు పర్యవేక్షించనున్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను తెలంగాణ స్టేట్ సీడ్స్, నేషనల్ సీడ్ కార్పొరేషన్, ప్రైవేట్ సంస్థల ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నారు. అవసరమైతే రైతు వేదికలను విత్తనాల పంపిణీ కేంద్రాలుగా వినియోగించనున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లపై సబ్సిడీలు, రుణాలు అందించేలా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక సూచనలు చేశారు. వచ్చే నెలల్లో కూడా ఎల్‌నినో ప్రభావం కొనసాగుతుందని.. బోరుబావుల కింద కూడా వరి సాగు చేయవద్దని సూచించారు. నీటి అవసరం తక్కువగా ఉండే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలు, కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. అలాగే గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులు రైతులకు వాతావరణ హెచ్చరికలు, నీటి లభ్యత, పంటల నిర్వహణపై నిరంతరం సమాచారం అందించాలని ఆదేశించారు.



## ధర్మేంద్ర రాజీనామా చేస్తేనే..!

(మొదటి పేజీ తరువాయి)

వేళ కేంద్ర మంత్రుల సమక్షంలో ఆయన తన దీక్షను విరమించారనే వార్త వెలువడగానే, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న నిరసనకారులు తీవ్ర ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. 26 రోజులుగా ఆయన ఆరోగ్యంపై ఆందోళన చెందుతున్న విద్యార్థులు, మద్దతుదారులు అర్ధరాత్రి దాటిన తర్వాత కేరింతలు కొడుతూ, డాన్సులు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. సోనమ్ వాంగుక్ సురక్షితంగా దీక్ష విరమించడం తమ పోరాటానికి లభించిన తొలి విజయంగా భావిస్తూ జంతర్ మంతర్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొల్పారు. సోనమ్ వాంగుక్ ఆరోగ్యం దృష్ట్యా దీక్ష విరమించినప్పటికీ తమ నిరసన ఆందోళనలు మాత్రం ఇక్కడితో ఆగిపోవని 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు తమ ధర్నా కొనసాగుతుందని ఆయన ప్రకటించారు. సోనమ్ వాంగుక్ చేసిన త్యాగం వ్యర్థం కాదని, శాంతియుతంగా తాము చేపట్టిన ఈ ఉద్యమం లక్ష్యం పూర్తయ్యే వరకు జంతర్ మంతర్ వేదికగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నిరసనకారులు స్పష్టం చేశారు.

## ..అట్లెట్ల గడువు కావాలి!

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం. కానీ ప్రజలు మాకు అధికారం ఇచ్చింది బాధ్యతలను నిర్వర్తించడానికే తప్ప, పారిపోవడానికి కాదు. మేము వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం' అని ఉన్నత స్థాయి ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో నెలకొన్న వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించడం, పేపర్ లీక్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవడంపైనే ప్రస్తుతం ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. శుక్రవారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న సీజేపీ విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వం రెండో విడత చర్చలు జరిపింది. ప్రభుత్వ ప్రతినిధులుగా కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడం, శాంతియుత నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం వంటి అంశాలకు సూత్రప్రాయంగా అంగీకరించిన ప్రభుత్వం, మంత్రి రాజీనామా విషయంలో మాత్రం శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరినట్లు కాక్రోచ్ జనతా పార్టీ తెలిపింది.

## ఎన్టీఏలో ప్రక్షాళన..
## 47 మందిపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

మరికొందరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. పరీక్షల నిర్వహణకు సంబంధించిన అవుట్‌సోర్సింగ్ విధానాన్ని కూడా పూర్తిగా మార్చాలని, అంతర్గత నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని భావిస్తోంది. ఈ ఏడాది జరిగిన నీట్–యూజీ పరీక్షలో పేపర్ లీక్ కావడం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. విద్యార్థుల ఆందోళనలు, పార్లమెంటులో విపక్షాల నిరసనలతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో సుమారు 22 లక్షల మంది విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. పరీక్షల నిర్వహణ వ్యవస్థను సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ప్రస్తుతం ఈ చర్యలు చేపడుతోంది. తాజా మార్పులు కేవలం స్వల్ప సర్దుబాట్లు కాదని, వ్యవస్థను సమూలంగా మార్చే 'ఫండమెంటల్ రీసెట్' అని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నీట్, జేఈఈ మెయిన్, సీయూఈటీ వంటి 15 నుంచి 20 కీలక జాతీయ స్థాయి పరీక్షలను ఎన్టీఏ నిర్వహిస్తోంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే ఈ ప్రవేశ పరీక్షల పవిత్రతను కాపాడటమే ఈ సంస్కరణల ప్రధాన ఉద్దేశం.

# పేపర్ లీక్ చేస్తే పదేళ్ల జైలు

(మొదటి పేజీ తరువాయి)

కొత్త సవరణలు చేర్చాలని నిర్ణయించింది. గతంలో పేపర్ లీకేజీ కేసులన్నీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్టు కింద పరిష్కరించే వారు. అయితే ఇప్పుడు ఆ చట్టానికి సవరణలు చేసి..వ్యవస్థీకృత నేరాల నివారణ చట్టాల కింద చేర్చాలని కేబినేట్ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం చట్టాల ప్రకారం పేపర్ లీకేజీ నిందితులకు 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష ఉన్నది. ఒకవేళ దోషిగా తేలితే రూ.10లక్షల జరిమానా కూడా విధించేవారు. నేరానికి చెందిన విషయాన్ని దాచిపెట్టే సర్వీస్ ప్రొవైడర్లకు రూ. కోటి జరిమానా విధిస్తున్నారు. ఒకవేళ వ్యవస్థీకృత నేరానికి పాల్పడితే, అప్పుడు నిందితులకు 5 నుంచి 10 ఏళ్ల జైలుశిక్ష పడనున్నది. కోటి జరిమానా విధించడం ఉంది. సవరణ ప్రతిపాదనల మేరకు కొత్తగా రూపొందించనున్న చట్టాల ప్రకారం పేపర్ లీకేజీ కేసులలో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు కేవలం మూడు నెలల్లో తమ తీర్పును వెలువరించాల్సి ఉంటుంది. పేపర్ లీకేజీలకు పాల్పడితే 10ఏళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. అలాగే నిందితులకు రూ.10 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. గడిచిన పదేళ్లలో దేశవ్యాప్తంగా సుమారు 150 పేపర్లు లీకేజీ అయిన నేపథ్యంలో పేపర్ల లీకేజీల నివారణకు కేంద్రం కఠిన చట్టం తేనుండటం ఆసక్తికరంగా మారింది.

**కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 2 శాతం పెంపు**

ఈ ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చేలా డియర్‌నెస్ అలవెన్స్, డియర్‌నెస్ రిలీఫ్‌ను 2 శాతం పెంచుతూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కేబినెట్ సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న 58 శాతం డీఏ, డీఆర్‌ను 60 శాతానికి పెంచినట్లు తెలిపారు. ద్రవ్యోల్బణం కారణంగా పెరుగుతున్న జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో 50 లక్షలకు పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68 లక్షలకు పైగా పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు. డీఏ, డీఆర్ పెంపు వల్ల కేంద్ర ప్రభుత్వ ఖజానాపై ఏడాదికి రూ.6,791 కోట్లకు పైగా అదనపు భారం పడనుందని మంత్రి తెలిపారు. దేశీయ సముద్ర బీమా వ్యవస్థను బలోపేతం చేయడానికి 'భారత్ మారిటైమ్ ఇన్సూరెన్స్ పూల్' ఏర్పాటుకు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనికి రూ.12,980 కోట్ల సావరిన్ గ్యారంటీ ఇవ్వనుంది. ఈ బీమా వ్యవస్థ ద్వారా అంతర్జాతీయ మార్గాల్లో సరకు రవాణా చేసే భారత నౌకలకు తక్కువ ప్రీమియంతో బీమా సౌకర్యం కల్పించనున్నారు. నౌకలు, సరుకు, యుద్ధ ప్రమాదాలు, బాధ్యత బీమా వంటి సముద్ర సంబంధిత అన్ని రకాల రిస్క్‌లకు ఇది వర్తిస్తుంది. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనను 2028 మార్చి వరకు కొనసాగించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా గ్రామాలను వ్యవసాయ మార్కెట్లు, ఉన్నత పాఠశాలలు, ఆసుపత్రులతో అనుసంధానించే రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ఈ పథకానికి సవరించిన వ్యయం రూ.83,977 కోట్లుగా నిర్ణయించారు. మైదాన ప్రాంతాల్లో రహదారులు, వంతెనల నిర్మాణానికి 2028 మార్చి వరకు, కొండ ప్రాంతాల్లో వంతెనల నిర్మాణానికి 2029 మార్చి వరకు గడువు పొడిగించారు.

## రాజ్యసభ ముందుకు వందేమాతరం బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

గేయాన్ని అవమానిస్తే జైలుశిక్ష విధించడంతో పాటు, ఇకపై ఈ గేయాన్ని ఎక్కడ ఆలపించినా పూర్తిగా మాత్రమే పాడాలనే కఠిన నిబంధనను కూడా బిల్లులో పొందుపరిచారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. బిల్లులోని నిబంధనలపై ఆందోళన వ్యక్తం చేస్తూ విపక్ష సభ్యులు సభలో నిరసనకు దిగారు. దీంతో విపక్షాల ఆందోళనతో సభా కార్యక్రమాలు స్తంభించిపోవడంతో, చైర్మన్ రాజ్యసభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. వందేమాతరం బిల్లుపై సోమవారం సభలో పూర్తిస్థాయి చర్చ జరగనుంది. ప్రభుత్వం దీనిని చట్టంగా మార్చాలని పట్టుదలతో ఉండగా, ప్రతిపక్షాలు మాత్రం తమ నిరసనను కొనసాగించే అవకాశం కనిపిస్తోంది.

## రాజ్యమా.. ఉలికిపడు!

(మొదటి పేజీ తరువాయి)

అన్యాయంపై న్యాయం మాత్రమే కోరుతున్నారని అన్నారు. యువత శక్తిని ఎవరూ తక్కువ అంచనా వేయవద్దని కేటీఆర్ హెచ్చరించారు. “ఇది భయపడే జనరేషన్ కాదు.. పాలకులను భయపెట్టే జనరేషన్” అని వ్యాఖ్యానించారు. యువతతో ఘర్షణ పడిన నేపాల్, బంగ్లాదేశ్ ప్రభుత్వాలు కూలిపోయిన పరిస్థితిని కేంద్రం గుర్తుంచుకోవాలని సూచించారు. గతంలో ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన చరిత్ర తమదేనని, ఇప్పుడు కూడా విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ తాము ధర్నా చేస్తుంటే, దానిని అడ్డుకునేందుకు యూత్ కాంగ్రెస్‌ను పంపడం ఎందుకని ప్రశ్నించారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## నీట్ అల్లర్ల వెనుక కమ్యూనిస్టులు

(మొదటి పేజీ తరువాయి)

17 మందిని అరెస్ట్ చేసిందని చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా దీనిపై క్షమాపణలు చెప్పారని గుర్తుచేశారు. విద్యార్థుల విద్యా సంవత్సరం ఏమాత్రం వృథా కాకూడదనే ఉద్దేశంతో కేవలం 40 రోజుల్లోనే మళ్లీ పరీక్షలు పూర్తి చేసి, ఫలితాలను కూడా వెల్లడించామని వివరించారు. ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో కమ్యూనిస్టు శక్తులు తీవ్ర అరాచకం సృష్టించాయని ఆయన ఆరోపించారు. ఏకంగా దేశ పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్రలు చేస్తూ, దేశ వ్యతిరేక నినాదాలతో విరుచుకుపడ్డారని మండిపడ్డారు. నిరసనల పేరుతో పోలీసులపై, మహిళా జర్నలిస్టులపై అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తూ దాడులు చేశారని విమర్శించారు. ఈ హింసలో 118 మంది పోలీసుల తలలు పగిలి తీవ్ర గాయాలైనా, అత్యంత సంయమనం పాటిస్తూ ఫైరింగ్ చేయలేదని, శాంతిభద్రతల రక్షణ కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో లాఠీచార్జ్ చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఢిల్లీలో చెలరేగిన ఈ ఉద్రిక్తతల వెనుక విదేశీ కుట్ర కోణం ఉందని బండి సంజయ్ సంచలన ఆరోపణ చేశారు.



# 18 మంది నుజ్జు నుజ్జు

(మొదటి పేజీ తరువాయి)

వాహనం టిండి గ్రామంలో రాత్రంతా నిలిచిపోయింది. శుక్రవారం ఉదయం అధికారులు మార్గాన్ని పునరుద్ధరించడంతో టాటా సుమో తన ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించింది. అయితే, ప్రయాణం మొదలైన కొద్దిసేపటికే భారీ బండరాళ్లు వాహనంపై పడటంతో ఈ పెను ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, జిల్లా యంత్రాంగం మరియు విపత్తు ప్రతిస్పందన బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంలో 13 మంది మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మృతుల వివరాలను సేకరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# డీలిమిటేషన్.. మోదీ మాస్టర్ ప్లాన్?

(శ్రీశైలం దూడం, ఫ్రీలాన్స్ జర్నలిస్టు)



"రాజు యుద్ధం మొదలుపెట్టే ముందు కత్తి మెరవదు... వ్యూహమే ముందుగా మెరుస్తుంది." ప్రస్తుతం భారత రాజకీయాల్లో డీలిమిటేషన్ అంశం చుట్టూ ఇదే చర్చ నడుస్తోంది. పైకి చూస్తే ఇది నియోజకవర్గాల పునర్విభజన మాత్రమే. కానీ లోతుగా పరిశీలిస్తే దేశ రాజకీయ శక్తి సమీకరణాలు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, భవిష్యత్ ఎన్నికల గణితాన్ని ప్రభావితం చేసే కీలక రాజ్యాంగ ప్రక్రియ. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 81, 82, 170 ప్రకారం డీలిమిటేషన్‌కు రాజ్యాంగబద్ధమైన ఆధారం ఉంది. 1971 జనాభా లెక్కల తర్వాత రాష్ట్రాల మధ్య లోక్‌సభ సీట్ల పంపిణీని తాత్కాలికంగా నిలిపివేయగా, ఆ గడువు 2026తో ముగియనున్న నేపథ్యంలో ఈ అంశం మళ్లీ జాతీయ చర్చకు వచ్చింది. ప్రతి ఓటుకు సమాన విలువ ఉండాలన్నది ప్రజాస్వామ్య సూత్రం. అయితే జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు రాజకీయంగా నష్టం కలగకూడదని దక్షిణాది రాష్ట్రాలు వాదిస్తున్నాయి. మరోవైపు అధిక జనాభా ఉన్న రాష్ట్రాలు తమ జనాభాకు తగిన ప్రాతినిధ్యం కోరుతున్నాయి. ఈ రెండు వాదనలూ రాజ్యాంగ స్ఫూర్తితో ముడిపడి ఉండటంతో సమతుల్య పరిష్కారం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. రాజకీయంగా చూస్తే, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ ప్రక్రియను వ్యూహాత్మకంగా ముందుకు తీసుకెళ్లే అవకాశముందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే పార్లమెంట్‌లో సంఖ్యాబలం మాత్రమే కాకుండా రాష్ట్రాల విశ్వాసాన్ని గెలుచుకోవడం కూడా అంతే కీలకం. ప్రతిపక్షం మాత్రం డీలిమిటేషన్ పేరుతో సమాఖ్య స్ఫూర్తికి భంగం కలగకూడదని, జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు అన్యాయం జరగరాదని వాదిస్తోంది. అదే సమయంలో ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉండాలనే రాజ్యాంగ సూత్రాన్ని కూడా విస్మరించలేమని పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో మరో ప్రతిపాదన కూడా చర్చకు వస్తోంది. ప్రస్తుతం ఉన్న రాష్ట్రాల లోక్‌సభ స్థానాలను తగ్గించకుండా మొత్తం లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచితే సమతుల్యత సాధ్యమవుతుందా? అనే ప్రశ్న రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. దీనివల్ల జనాభా పెరిగిన రాష్ట్రాలకు అదనపు ప్రాతినిధ్యం లభించడంతో పాటు, ప్రస్తుతం ఉన్న రాష్ట్రాల ప్రాతినిధ్యం కూడా తగ్గకుండా ఉండే అవకాశం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు. డీలిమిటేషన్ ప్రభావం కేవలం సీట్ల సంఖ్యకే పరిమితం కాదు. ప్రాంతీయ పార్టీల బలం, ఎన్నికల వ్యూహాలు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, జాతీయ రాజకీయ సమీకరణాలపై కూడా దీని ప్రభావం ఉండే అవకాశం ఉంది. అందుకే ఇది పరిపాలనా ప్రక్రియ మాత్రమే కాకుండా భారత ప్రజాస్వామ్య భవిష్యత్తును ప్రభావితం చేసే కీలక నిర్ణయంగా మారింది. చివరికి ప్రశ్న ఒక్కటే.. డీలిమిటేషన్ సమాన ప్రాతినిధ్యానికి మార్గం చూపుతుందా? లేక కొత్త రాజకీయ విభేదాలకు దారితీస్తుందా? దీనికి సమాధానం పార్లమెంట్ చర్చలు, రాజకీయ సంప్రదింపులు, రాజ్యాంగబద్ధ నిర్ణయాల ద్వారానే లభిస్తుంది. ప్రజాస్వామ్యంలో సంఖ్యలు ప్రభుత్వాలను ఏర్పాటు చేయగలవు. కానీ విశ్వాసమే దేశాన్ని ఏకం చేస్తుంది. అదే డీలిమిటేషన్ విజయానికి అసలైన ప్రమాణం.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## అశ్లీల కంటెంట్‌పై కేంద్రం ఉక్కుపాదం

**మరో 50 ఓటీటీ యాప్‌లపై నిషేధం**

న్యూఢిల్లీ: డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో అశ్లీల, అభ్యంతరకర కంటెంట్‌ను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కఠిన నిర్ణయం తీసుకుంది. సమాజానికి హానికరం కలిగించేలా అసభ్యకర దృశ్యాలను ప్రసారం చేస్తున్న 50 ఓటీటీ యాప్‌లను దేశవ్యాప్తంగా బ్లాక్ చేస్తూ సంచలన ఆదేశాలు జారీ చేసింది. గతేడాది 25, ఈ ఏడాది ఫిబ్రవరిలో మరో 5 యాప్‌లపై చర్యలు తీసుకున్న కేంద్రం, తాజాగా మరిన్ని యాప్‌లపై ఉక్కుపాదం మోపడం గమనార్హం. కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిస్తూ ఈ విషయాన్ని తెలిపారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల కంటెంట్‌ను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, చట్టాలను ఉల్లంఘించే యాప్‌లపై ఎలాంటి దాక్షిణ్యం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సమాచార సాంకేతిక (డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) నిబంధనలు-2021 ప్రకారం ఈ యాప్‌లపై చర్యలు తీసుకున్నారు. ఈ ప్లాట్‌ఫారమ్‌లలోని కంటెంట్ భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 294తో పాటు మహిళల అసభ్య ప్రాతినిధ్య (నిషేధ) చట్టంలోని సెక్షన్ 4కు విరుద్ధంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వ్యూస్, సబ్‌స్క్రిప్షన్ల ఆదాయం కోసమే ఇలాంటి అశ్లీల దృశ్యాలను ప్రోత్సహిస్తున్నట్లు తేలడంతో వీటి యాక్సెస్‌ను పూర్తిగా నిలిపివేశారు.



## కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా కోడెమొక్కులు

వేములవాడ అర్బన్, జూలై 24 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణ బీఆర్ఎస్ నాయకులు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు స్వామివారికి కోడెమొక్కు చెల్లించి, కేటీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ ముఖద్వారం వద్ద భక్తులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, సీనియర్ నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు సిరిగిరి చందు, మారం కుమార్తో పాటు పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాదం

**కాంట్రాక్ట్ కార్మికుడు దుర్మరణం!**

విశాఖపట్నం, జూలై 24 (ఈవార్తలు): ఏపీలోని విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో భద్రతా లోపాలు మరోసారి బయటపడ్డాయి. ప్లాంట్‌లోని 'కోక్ ఓవెన్' విభాగంలో చోటుచేసుకున్న ప్రమాదంలో అనంత బార్వే అనే కాంట్రాక్ట్ కార్మికుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. విధులు నిర్వహిస్తుండగా ఊహించని విధంగా భారీ ఐరన్ బార్ ఆయనపై పడటంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్టీల్ ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరుపుతున్నారు. నెల రోజుల క్రితమే ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి పదిమంది కార్మికులు దుర్మరణం పాలైన విషాదం నుంచి తేరుకోకముందే, మళ్లీ ఇలాంటి ఘోరం జరగడం తీవ్ర కలకలం రేపుతోంది. ఆ ప్రమాదంలో హాట్ మెటల్ ఒకేసారి విరుచుకుపడి అగ్నిగోళంలా బద్దలవడంతో కార్మికులు సజీవదహనమయ్యారు. విశాఖ స్టీల్ ప్లాంట్ చరిత్రలోనే అత్యంత దారుణమైన ప్రమాదంగా నిలిచిన ఆ ఘటనపై ఇప్పటికే కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్లాంట్‌లో పనిచేసే వేలాది మంది కార్మికులకు కనీస ప్రాణ రక్షణ కల్పించాలని, భద్రతా ప్రమాణాలను తక్షణమే పునఃసమీక్షించాలని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి.

## విద్యార్థులను శత్రువుల్లా చూస్తోంది

**కేంద్రంపై సోనియా తీవ్ర విమర్శలు**

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం దేశ శత్రువుల్లా చూస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆరోపించారు. విద్యార్థుల ధైర్యానికి ప్రభుత్వం జవాబుదారీతనంతో స్పందించాల్సిందిపోయి, లాఠీచార్జీలు, బాష్పవాయువు ప్రయోగంతో అణచివేస్తోందని విమర్శించారు. 'ది హిందూ'లో శుక్రవారం ప్రచురితమైన తన వ్యాసంలో సోనియా గాంధీ కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. నీట్ పేపర్ లీక్, పరీక్షల వ్యవస్థలో లోపాలు, విద్యా సంస్కరణల కోసం విద్యార్థులు న్యాయమైన డిమాండ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం వారిని దేశ భవిష్యత్తుగా కాకుండా శత్రువులుగా చూస్తోందని విమర్శించారు. జులై 20న ఢిల్లీలో జరిగిన ఘటనలను 'అప్రతిష్ఠకరమైన రోజు' సోనియా అభివర్ణించారు.

## జర్నలిస్టుల రైల్వే పాసులు పునరుద్ధరించాలి

**రైల్ నిలయం ఎదుట టీడబ్ల్యూజేఎఫ్ ధర్నా.. దక్షిణ మధ్య రైల్వే అధికారికి వినతిపత్రం**



హైదరాబాద్, జూలై 24 (ఈవార్తలు): జర్నలిస్టులకు రైల్వే ప్రయాణ పాసులను వెంటనే పునరుద్ధరించి, ఈసారి పూర్తిస్థాయిలో 100 శాతం రాయితీతో ఉచితంగా అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ప్రధాన ద్వారం ఎదుట టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన చేపట్టారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ కె. కిరణ్ కుమార్‌కు అందజేశారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన నిరసనలో జర్నలిస్టులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర యాక్టింగ్ అధ్యక్షుడు పీ. రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ, కరోనా సమయంలో రద్దు చేసిన రైల్వే పాసులను ఐదేళ్లు గడిచినా పునరుద్ధరించకపోవడం వల్ల జర్నలిస్టులు విధుల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్థానిక, జాతీయ స్థాయిలో వార్తల సేకరణకు తరచూ ప్రయాణించాల్సి వస్తున్నప్పటికీ ప్రయాణ వ్యయభారం పెరిగిందని పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలకు భారీ రాయితీలు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టుల రైల్వే పాసుల పునరుద్ధరణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కనీస వేతనాల అమలు లేకపోవడం, నిత్యావసర ధరల పెరుగుదలతో పాత్రికేయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ, రైల్వే శాఖలు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని, రైల్వే పాసులను వెంటనే 100 శాతం రాయితీతో పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై పలుమార్లు కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో పాటు రైల్వే బోర్డు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. డిమాండ్లు నెరవేర్చకపోతే దేశవ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాసి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు గుడిగ రఘు, బి. రాజశేఖర్, కార్యదర్శి ఈ. చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల కృష్ణ, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ మీ రాజ్యం కాదు

**కోమటిరెడ్డి బ్రదర్స్‌పై మందుల సామేల్ ఫైర్**

నల్లగొండ, జూలై 24 (ఈవార్తలు): కోమటిరెడ్డి సోదరులపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలతో.. కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత విభేధాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. తన తుంగతుర్తి నియోజకవర్గంపై కోమటిరెడ్డి బ్రదర్స్ పెత్తనం ఏంటని మందుల సామేల్ నిలదీశారు. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కల్లోలం బయటికి వచ్చింది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై సొంత పార్టీ ఎమ్మెల్యే మందుల సామేల్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తనకు సమాచారం ఇవ్వకుండా తన నియోజకవర్గంలో పర్యటించడం ప్రోటోకాల్‌కు విరుద్ధమని ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లా మీ రాజ్యం అనుకుంటున్నారా అంటూ ప్రశ్నించిన మందుల సామేల్.. తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల గురించి వ్యాఖ్యలు చేసే ముందు మునుగోడు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి హితవు పలికారు. తాము ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో గెలిచామని.. ఎవరి దయాదాక్షిణ్యాలతో ఈ పదవిలోకి రాలేదని స్పష్టం చేశారు. తన నియోజకవర్గ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని తీవ్ర హెచ్చరికలు చేసిన మందుల సామేల్.. కాంగ్రెస్ పార్టీ కోసం లంబాడా సామాజిక వర్గం చేసిన సేవలను గుర్తించి వారికి మంత్రి పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తన హక్కులను కాలరాస్తే పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని కూడా హెచ్చరించారు. 2 కిలోమీటర్ల రోడ్డు కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చుట్టూ వందసార్లు తిరిగానని మందుల సామేల్ పేర్కొన్నారు. మంత్రిగా ఆయన ఏం చేశారని ప్రశ్నించారు. రాజగోపాల్‌రెడ్డికి తుంగతుర్తి నియోజకవర్గం గురించి ఎందుకని నిలదీశారు. తన నియోజకవర్గం జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని.. ఒకవేళ ప్రొటోకాల్ ఉల్లంఘించి.. తనకు సమాచారం లేకుండా తన నియోజకవర్గంలో అడుగుపెట్టే అధికారం ఎవరు ఇచ్చారని హెచ్చరించారు. మందుల సామేల్ తుంగతుర్తిలోనే ఉంటాడు ఖబడ్దార్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## ధర్మేంద్ర రాజీనామా చేశాకే 'నీట్'పై చర్చ

**కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు లోక్‌సభలో ఎలాంటి చర్చకూ ఒప్పుకునేది లేదని విపక్ష నేత (ఎల్‌ఓపీ) రాహుల్ గాంధీ శుక్రవారం స్పష్టం చేశారు. మంత్రిని పదవి నుంచి తొలగించాకే తదుపరి సంభాషణ ఉంటుందని ఆయన తేల్చిచెప్పారు. విపక్షాల ఆందోళనల నడుమ లోక్‌సభ వాయిదా పడిన కాసేపటికే ఈ పరిణామం చోటుచేసుకుంది. అంతకుముందు, పేపర్ లీకేజీల అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సభలో ప్రకటించారు. పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కఠిన చట్టాలు తెస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ, రాహుల్ గాంధీ చర్చకు సహకరించాలని రిజిజు కోరారు. అనంతరం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, సభలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, తన మైక్‌ను లాగేసుకున్నారని ఆరోపించారు.

## మోదీ సెల్ఫీ వీడియో.. రాత్రికి రాత్రే 10 లక్షల ఫాలోవర్లు!

న్యూఢిల్లీ: ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ వీడియో సంచలనం సృష్టిస్తోంది. ఈ విషయంపై ఆయన ఇచ్చిన భరోసాకు ప్రజల నుంచి విస్తృత ఆమోదం లభించిందనడానికి నిదర్శనంగా.. రాత్రికి రాత్రే ఆయన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో దాదాపు 10 లక్షల మంది కొత్త ఫాలోవర్లు చేరారు. దీంతో ఆయన మొత్తం ఫాలోవర్ల సంఖ్య 101 మిలియన్ల (10.1 కోట్లు) మైలురాయిని దాటింది. గురువారం రాత్రి ప్రధాని పోస్ట్ చేసిన ఈ సెల్ఫీ వీడియోలో, పేపర్ లీక్‌ల సమస్యపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడుతున్న తీవ్రమైన ఆవేదనను తాను అర్థం చేసుకోగలనని పేర్కొన్నారు. గత రెండున్నర నెలలుగా కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై కఠిన చర్యలు తీసుకుంటోందని, ఇప్పటికే బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని మోదీ స్పష్టం చేశారు. ఇటీవల దాదాపు 22 లక్షల మంది విద్యార్థుల కోసం ఎలాంటి జాప్యం లేకుండా పరీక్షలు నిర్వహించామని, కేవలం ఐదు రోజుల క్రితం జులై 19న ఫలితాలు కూడా ప్రకటించామని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా విజయం సాధించిన విద్యార్థుల నుంచి ఆనందకరమైన వార్తలు వస్తున్నాయని అన్నారు. ఇంతటితోనే తమ ప్రభుత్వం సంతృప్తి పడదని, పరీక్షల అక్రమాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు విధించేలా ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి ఒక బలమైన ప్రతిపాదనను తాను వ్యక్తిగతంగా సిద్ధం చేశానని ఆయన వెల్లడించారు. ఈ పరిణామం ప్రపంచ వేదికపై ప్రధాని మోదీకి డిజిటల్ మాధ్యమాల్లో ఉన్న భారీ ఆదరణను మరోసారి రుజువు చేసింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది ఫాలోవర్లు ఉన్న రాజకీయ నాయకుడిగా, ప్రపంచ నేతగా ఆయన కొనసాగుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వంటి ఇతర ప్రముఖ అంతర్జాతీయ నేతలతో పోలిస్తే మోదీ ఫాలోవర్ల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ వీడియో ద్వారా అసమ్మతి తెలిపేవారితో చర్చకు సిద్ధమనే సంకేతం ఇస్తూనే, అవినీతిపై తన ప్రభుత్వ జీరో టాలరెన్స్ విధానాన్ని చాటుకున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు.

## బంగ్లాదేశ్ అధ్యక్షుడు రాజీనామా

ఢాకా: పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. ఆ దేశాధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ తన పదవికి రాజీనామా చేశారు. ఐదేళ్ల పదవీకాలం ముగియడానికి మరో రెండేళ్ల సమయం ఉండగానే ఆయన ఈ కీలక నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే, అనారోగ్య కారణాల వల్లనే ఆయన పదవి నుంచి తప్పుకున్నారని స్థానిక మీడియా వెల్లడించింది. ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వంతో విభేదాలు, మాజీ ప్రధాని షేక్ హసీనాతో ఉన్న సన్నిహిత సంబంధాలే ఈ రాజీనామాకు ప్రధాన కారణాలని తెలుస్తోంది. 2024లో విద్యార్థి ఉద్యమం నేపథ్యంలో అధికారాన్ని కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనా, డిసెంబర్‌లో స్వదేశానికి తిరిగి వస్తానని ఇటీవలే ప్రకటించారు. ఈ ప్రకటన వెలువడిన కొద్ది రోజులకే అధ్యక్షుడు రాజీనామా చేయడం గమనార్హం. 2023లో షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ మద్దతుతో షహబుద్దీన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హసీనా ప్రభుత్వం పతనమైన తర్వాత, ఆ నాటి పాలనకు సంబంధించి కీలక రాజ్యాంగ పదవిలో కొనసాగుతున్న చివరి వ్యక్తి ఆయనే.

## పీఓకేలో నరమేధంపై భారత్ ఫైర్

**ఐరాసలో పాకిస్థాన్‌ను ఏకిపారేసిన కేంద్రం**

జెనీవా: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) సహా పాకిస్థాన్ వ్యాప్తంగా జరుగుతున్న తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘనలపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) మౌనం వహించడాన్ని భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇతర దేశాల్లోని ఇలాంటి పరిణామాలపై గొంతెత్తే ఐరాస.. పాకిస్థాన్ విషయానికి వచ్చేసరికి ఎందుకు మౌనంగా ఉంటోందని నిలదీసింది. ఐరాస భద్రతా మండలిలో జరిగిన ఓ చర్చా కార్యక్రమంలో పాకిస్థాన్ మరోసారి కశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా, భారత్ ఘాటుగా స్పందించింది. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పి. హరీశ్ మాట్లాడుతూ.. 'శాంతియుత వివాద పరిష్కార యంత్రాంగాలను బలోపేతం చేయడం' అనే అంశంపై జరిగిన చర్చలో పాకిస్థాన్ నిజస్వరూపాన్ని ప్రపంచం ముందుంచారు. "పాక్ ఆక్రమిత జమ్మూ కశ్మీర్‌లో జరుగుతున్న పరిణామాలు పాకిస్థాన్ అసలు నైజాన్ని పూర్తిగా బట్టబయలు చేస్తున్నాయి. అక్కడ కశ్మీరీల ప్రాథమిక హక్కులు, భావప్రకటనా స్వేచ్ఛను పాకిస్థాన్ దశాబ్దాలుగా కాలరాస్తోంది. ఇది ఇప్పుడు జరుగుతున్నది కాదు, దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా పాక్ అనుసరిస్తున్న వ్యూహంలో భాగం" అని హరీశ్ స్పష్టం చేశారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న కశ్మీరీలను పాక్ ప్రభుత్వం కిరాతకంగా అణచివేస్తోందని భారత్ ఆరోపించింది. "గత జూన్ నుంచి ఇప్పటివరకు పాక్ భద్రతా దళాల చేతుల్లో 34 మంది కశ్మీరీలు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవలే జులై 14న తారార్‌ఖల్‌లో ఆరుగురు కశ్మీరీలను పాక్ దళాలు హతమార్చాయి" అని హరీశ్ వివరించారు. పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం ఎలా ఖూనీ అవుతోందో కూడా భారత్ ఎత్తిచూపింది. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను కల్పిత ఆరోపణలతో జైల్లో పెట్టడం, ఆయన పార్టీ పీటీఐని ఎన్నికల్లో పాల్గొనకుండా అడ్డుకోవడం వంటి చర్యలను ప్రస్తావించింది. దేశ చరిత్రలో నిరంతరం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాలన సాగిస్తున్న పాక్ సైన్యం.. రాజ్యాంగంలోని 27వ సవరణ ద్వారా రాజ్యాంగ కుట్రకు పాల్పడిందని విమర్శించింది. ఈ సవరణ ద్వారా సైనిక ఉన్నతాధికారులకు జీవితకాలం పాటు క్రిమినల్ విచారణ నుంచి మినహాయింపు కల్పించారని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని అన్నారు.

## సెన్సెక్స్ 900 పాయింట్లు పతనం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 900 పాయింట్లకుపైగా పడిపోయింది. నిఫ్టీ 23,700 మార్కు దిగువకు చేరింది. ముడి చమురు ధరల పెరుగుదల, అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలు, నిరాశపరిచిన తొలి త్రైమాసిక ఫలితాలు మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. ఉదయం 10.20 గంటల ప్రాంతంలో బీఎస్ఈ సెన్సెక్స్ 902.48 పాయింట్లు నష్టపోయి 75,488.91 వద్ద ట్రేడవుతోంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 256.15 పాయింట్లు పతనమై 23,613.45 వద్ద కొనసాగుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంతో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 100 డాలర్లను దాటింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే ఆందోళన పెట్టుబడిదారుల్లో పెరిగింది. చమురు ధరల పెరుగుదలతో ద్రవ్యోల్బణం, వాణిజ్య లోటు, రూపాయి బలహీనత వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. అమెరికా మార్కెట్లలో గురువారం నమోదైన భారీ పతనం కూడా దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపింది. ఆల్ఫాబెట్, టెస్లా కంపెనీల నిరాశపరిచిన ఫలితాల తర్వాత డోజోన్స్, ఎస్అండ్‌పీ 500, నాస్‌డాక్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొంది.



## ఘనంగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

జగిత్యాల, జూలై 24 (ఈవార్తలు): నేషనల్ జావెలిన్ డే, తెలంగాణ కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ సందర్భంగా జగిత్యాల జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ వాణి-శ్రీనివాస్, కౌన్సిలర్ ఆరవ లక్ష్మి-రాజు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వాణి-శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి, సంఘం సభ్యులు, క్రీడా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వివిధ వయసు విభాగాల్లో బాలబాలికలకు రన్నింగ్, బ్రాడ్‌జంప్, జావెలిన్ త్రో తదితర పోటీలు నిర్వహించారు.

## కోరుట్ల ఎస్ఐ చిరంజీవి సస్పెండ్



కోరుట్ల, జూలై 24 (ఈవార్తలు): కోరుట్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న చిరంజీవిని సస్పెండ్ చేస్తూ బాసర జోన్ డీఐజీ భాస్కరన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో ఈ చర్య తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందని పోలీసు శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని తాజా సస్పెన్షన్ ద్వారా స్పష్టమవుతోంది. సస్పెన్షన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం.

## బోర్నపల్లి-జగన్నాథపూర్ హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేయాలి

**మంత్రి అడ్లూరికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వినతి**

రాయికల్, జూలై 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ మండలం బోర్నపల్లి నుంచి జగన్నాథపూర్ వరకు రహదారిపై హైలెవల్ బ్రిడ్జి మంజూరు చేయాలని కోరుతూ జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జగన్నాథపూర్ గ్రామం నది, దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండటంతో పాటు పూర్తిగా గిరిజన జనాభా కలిగిన గ్రామమని ఎమ్మెల్యే తెలిపారు. పెద్దవాగు నది కారణంగా ఈ గ్రామం మండలంలోని ఇతర ప్రాంతాల నుంచి వేరుపడిందన్నారు. గ్రామ ప్రజలు తమ అవసరాల కోసం మండల కేంద్రం రాయికల్‌కు వెళ్లాలంటే దాదాపు 15 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని వివరించారు. బోర్నపల్లి నుంచి జగన్నాథపూర్ వరకు రహదారిపై సుమారు రూ.16.20 కోట్ల అంచనా వ్యయంతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే జగన్నాథపూర్ గ్రామస్థులకు బోర్నపల్లి మీదుగా రాయికల్ మండల కేంద్రానికి నేరుగా రవాణా సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. గిరిజన గ్రామ ప్రజల ఇబ్బందులను తొలగించే ఉద్దేశంతో ఈ ప్రతిపాదనను కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లి వంతెన మంజూరుకు కృషి చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే కోరారు.

## ఆస్తి వివాదంలో వదినపై హత్యాయత్నం

**సుపారీ ఇచ్చిన కుటుంబ సభ్యులు**

**యూపీ నుంచి పిస్టల్ కొనుగోలు.. నలుగురు నిందితుల అరెస్టు**

మెట్‌పల్లి, జూలై 24 (ఈవార్తలు): మెట్‌పల్లి పట్టణంలో ఇటీవల సంచలనం సృష్టించిన కాల్పుల ఘటన మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆస్తి వివాదాల నేపథ్యంలో సొంత వదిన గోనెల లక్ష్మిని హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ప్రధాన కుట్రదారులతో సహా నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గోనెల శంకర్, ఆయన సోదరుడు రాజం మధ్య వ్యవసాయ భూమి, ఇంటికి సంబంధించి చాలాకాలంగా వివాదం కొనసాగుతోంది. లక్ష్మి తన వాటా కోసం ప్రశ్నించడంతో ఆమెను హత్య చేయాలని శంకర్, ఆయన భార్య అనూష, బంధువు గోపి ముత్తయ్య కుట్ర పన్నినట్లు పోలీసులు తెలిపారు. శంకర్ వద్ద జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన సచిన్‌కుమార్‌కు సుపారీ ఇచ్చి హత్యకు ఒప్పించారు. పథకం ప్రకారం సచిన్ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి నాటు పిస్టల్, కాట్రిడ్జీలు కొనుగోలు చేసి మెట్‌పల్లికి తీసుకొచ్చాడు. జూన్ 15న అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ముఖానికి రుమాలు కట్టుకుని మోటార్‌సైకిల్‌పై లక్ష్మి ఇంటికి వెళ్లి, వరండాలో నిద్రిస్తున్న ఆమెపై కాల్పులు జరిపాడు. అయితే బుల్లెట్ లక్ష్యం తప్పి ఆమె ఎడమ చెంపకు తగలడంతో ప్రాణాపాయం తప్పింది. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ ఎ.రాములు పర్యవేక్షణలో సీఐ బి.సురేష్‌బాబు, ఎస్ఐ పి.కిరణ్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, ఆర్థిక లావాదేవీలను విశ్లేషించి కేసును ఛేదించారు. నిందితుల నుంచి నాటు పిస్టల్, రెండు సజీవ కాట్రిడ్జీలు, మోటార్‌సైకిల్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## నీట్ అక్రమాలకు నిరసనగా మల్యాలలో విద్యాసంస్థల బంద్

మల్యాల, జూలై 24 (ఈవార్తలు): నీట్ పరీక్షలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలు, పేపర్ లీక్ ఘటనలు, అలాగే తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఢిల్లీలో పోలీసులు వ్యవహరించిన తీరుకు నిరసనగా మల్యాల మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పిలుపు మేరకు శుక్రవారం చేపట్టిన బంద్‌లో భాగంగా మండలంలోని పాఠశాలలు, కళాశాలలను మూసివేయించి నిరసన తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న నీట్ అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్యాల మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కోరేపు వెంకటేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శనిగారపు తిరుపతి, డీసీసీ ప్రధాన కార్యదర్శి నక్క అనిల్, కాంగ్రెస్ నాయకులు మిట్టే శ్రీనివాస్, తైదల గణేష్, ప్రకాష్ రెడ్డి, గుర్రం శ్రీకాంత్, నక్క శ్రీను, కట్కూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.




## మల్యాలలో ఘనంగా పలారం బండి కార్యక్రమం

మల్యాల, జూలై 24 (ఈవార్తలు): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మల్యాలలో నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పలారం బండి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పలారాన్ని నైవేద్యంగా సమర్పించి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోతురాజుల విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకోగా, ఒగ్గు కళాబృందం ప్రదర్శించిన జానపద కళారూపాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పుల మోతలు, అమ్మవారి నామస్మరణలతో మల్యాల మండలం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నవదుర్గ సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ, అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన భక్తులు, దాతలు, స్వచ్ఛంద సేవకులకు నవదుర్గ సేవా సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## జగిత్యాలకు వెల్‌నెస్ సెంటర్ ఇవ్వండి

**మంత్రి దామోదరకు ఎమ్మెల్యే సంజయ్ వినతి**



హైదరాబాద్, జూలై 24 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల కోసం వెల్‌నెస్ సెంటర్ మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి వెల్‌నెస్ సెంటర్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ విషయంపై సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించనున్నామని, ఆ సమావేశానికి హాజరు కావాలని కోరినట్లు పేర్కొన్నారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్‌కు తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కరబూజ రవీందర్, కార్యదర్శి కొలిచాల రవీందర్, ఆర్థిక కార్యదర్శి గుండేటి గంగాధర్, అర్బన్ అధ్యక్షుడు మెట్ట మల్లికార్జున్, కార్యదర్శి కంటె అంజయ్య, ఆర్థిక కార్యదర్శి వేల్పుల ప్రతాప్‌తో పాటు జిల్లా, అర్బన్ యూనిట్ కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఫీజు బకాయి-బీజేపీ లడాయి

**ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి.. బీజేవైఎం ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ**



జగిత్యాల, జూలై 24 (ఈవార్తలు): విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఇట్టేడి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం జగిత్యాల జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో 'ఫీజు బకాయి-బీజేపీ లడాయి' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇట్టేడి రాజు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్కాలర్‌షిప్‌ల జాప్యంతో పాటు ప్రభుత్వ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దురిశెట్టి మమత, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్, జిల్లా కార్యదర్శి సుదవేని మహేష్, జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, జిల్లా కార్యాలయ కార్యదర్శి జూంబర్తి దివాకర్, పార్లమెంట్ కో-కన్వీనర్ గుంటూక సదాశివ్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, బీజేవైఎం నాయకులు పూదరి పవన్, ధీటి వెంకటేష్, పందిరి నాగరాజు, వాకిటి తిరుపతిరెడ్డి, ఐటీ సెల్ కన్వీనర్ పిస్క రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## అదానీ ఎనర్జీకి 8,500 కోట్ల భారీ ప్రాజెక్ట్

విశాఖపట్నం, జూలై 24 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చే దిశగా మరో కీలక ముందడుగు పడింది. ప్రముఖ సంస్థ అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్) రాష్ట్రంలో రూ. 8,500 కోట్ల విలువైన భారీ ఇంటర్-స్టేట్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టును దక్కించుకుంది. విశాఖపట్నం ప్రాంతంలో ప్రతిపాదిత గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీని ద్వారా సుమారు 4,500 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం నిర్వహించిన టారిఫ్-ఆధారిత పోటీ బిడ్డింగ్ (టీబీసీబీ) విధానంలో అత్యంత పోటీతత్వ ధరను కోట్ చేసి అదానీ ఎనర్జీ ఈ ప్రాజెక్టును కైవసం చేసుకుంది. ఒప్పందం ప్రకారం.. ఈ ప్రాజెక్టును 30 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రాజెక్టును 'వైజాగ్ పవర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్' అనే ప్రత్యేక సంస్థ (ఎస్‌పీవీ) కింద నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టుపై అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ సీఈఓ కందర్ప్ పటేల్ మాట్లాడుతూ.. "భారతదేశ పారిశ్రామిక ప్రగతికి అవసరమైన ఇంధన మౌలిక సదుపాయాల నిర్మాణంలో వైజాగ్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్ ఒక ముఖ్యమైన ముందడుగు. ఇది ఏపీలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా సామర్థ్యం అభివృద్ధికి మద్దతు ఇవ్వడమే కాకుండా, పెందుర్తి-విశాఖపట్నం ప్రాంతంలో పెరుగుతున్న డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిమాండ్‌కు గ్రిడ్‌ను బలోపేతం చేస్తుంది" అని వివరించారు.

## ఘనంగా బీజేపీ నేత ప్రతాప రామకృష్ణ జన్మదిన వేడుకలు



వేములవాడ అర్బన్, జూలై 24 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సనాతన ధర్మ పరిరక్షకుడు ప్రతాప రామకృష్ణ 66వ జన్మదిన వేడుకలను బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, 66 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, లిలి"వేములవాడ అంటే రాజన్న.. బీజేపీ అంటే రామన్న"లిలి అనే స్థాయిలో ప్రతాప రామకృష్ణ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రజలతో ఎల్లప్పుడూ ఆప్యాయంగా మెలుగుతూ, అవసరమైన వారికి అండగా నిలిచే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు. రాజన్న, భీమన్నల ఆశీస్సులతో ప్రతాప రామకృష్ణ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. కౌన్సిలర్లు ముత్యం వంగల సీను, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్, కోలా కృష్ణస్వామి, నాయకులు రేగుల మల్లికార్జున్, రేగుల శ్రీకాంత్, కటకం శ్రీనివాస్, నామాల శేఖర్ తదితరులు మాట్లాడుతూ, ప్రతాప రామకృష్ణ మంచి ఆరోగ్యంతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆలయంలో ప్రత్యేకంగా మొక్కులు చెల్లించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంటి అంజిబాబు, బోనాల శివ, మామిళ్ల లక్ష్మీరాజ్యం, పిన్నింటి హనుమాన్లు, గుడిసె మనోజ్, బిల్ల కృష్ణ, వాసం మల్లేశం, డాక్టర్ వెంకన్న, చిక్కుడు మల్లేశం, సగ్గు రాహుల్, సత్యం, తిరుమల్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో కుంకుమ పూజలు



జగిత్యాల టౌన్, జూలై 24 (ఈవార్తలు): ఆషాఢ మాసం దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు సమీపంలో ఉన్న శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేసి, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డ్రా ద్వారా ఎంపికైన ఒక భక్తురాలికి అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదం, తాంబూలాన్ని ఆలయ అర్చకులు ఆశీర్వచనాలతో అందజేశారు. అలాగే భక్తులు అమ్మవారికి ముడుపులు సమర్పించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు వేడుకలను కూడా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు లక్కీ డ్రా ద్వారా ముగ్గురికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ బహుమతులను రేగొండ శ్రీహరి-లక్ష్మి దంపతులు (జగిత్యాల) అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఒడ్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు ఒడ్నాల లత, భారతాల గీత, రాణి, సంధ్య, అన్నపూర్ణ, భాగ్యలక్ష్మి, రేగొండ లక్ష్మి, దేవి, పద్మావతి, సునీత, హర్షిణి, దివ్య, భావన, సుజాత, విజయలక్ష్మి, మౌనిక, ఆలయ అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులకు మాజీ ఎమ్మెల్యే కిరణ్ పరామర్శ



విజయనగరం, జూలై 24 (ఈవార్తలు): ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ జి సిగడాం మండలంలోని బాతువ గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఈ పర్యటనల్లో భాగంగా అనారోగ్యం, ప్రమాదవశాత్తు బారినపడిన కోలుకుంటున్న పలువురు పార్టీ నాయకులను ఆయన పరామర్శించారు. పార్టీ సీనియర్ నాయకులు, వార్డు మెంబర్ ముళ్ల సన్యాసిరావు కొద్దిరోజులు కిందట బ్రెయిన్, హార్ట్ స్ట్రోక్‌కు గురై ఆస్పత్రిలో చేరారు. కొద్దిరోజులపాటు ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న ఆయన ఇంటికి చేరుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. అలాగే, కొద్దిరోజులు కిందట ప్రమాద వశాత్తు విద్యుత్ పోల్‌పై నుంచి పడి గాయపడి కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న బీఎల్ఏ లెంక రమణ, అదే విధంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరి కోలుకున్న మాజీ వార్డు మెంబర్ కూనుబిల్లి నారాయణమ్మను వారి ఇళ్లకు వెళ్లి మాజీ ఎమ్మెల్యే కిరణ్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి మీసాల వెంకట రమణ, పార్టీ మండల అధ్యక్షులు డోల వెంకట రమణ, జిల్లా యువజన విభగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాలి అప్పలసూరి, ఎంపీటీసీ బూటు అప్పారావు, మాజీ సర్పంచ్ పల్లేడ సన్యాసిరావు, నీటి సంఘం ప్రెసిడెంట్ జమ్ము ఉత్తర నాయుడు, వార్డు మెంబర్లు ముల్లు పాపినాయుడు, వావిలపల్లి సూర్యనారాయణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మీసాల కన్నం నాయుడు, మండల పార్టీ కార్యదర్శి బెవర పాపినాయుడు, పార్టీ నాయకులు కూనుబిల్లి మోహనరావు, పల్లేడ సూర్యారావు, బూటు చిరంజీవి, ముల్లు కృష్ణారావు, దన్నాన ఈశ్వరరావు, సుంకరి గొల్లబాబు, దన్నాన మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు దృశ్యాలు సోషల్ మీడియాలో ఎలా?

**సుప్రీంకోర్టు ఆగ్రహం..**

**కీలక ఆదేశాలు జారీ**

న్యూఢిల్లీ: కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌లను సోషల్ మీడియాలో విచ్చలవిడిగా, అసంపూర్తిగా ప్రసారం చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. కోర్టు కార్యకలాపాల వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని సీసాలో నుంచి బయటకు వచ్చిన భూతంతో పోల్చిన ధర్మాసనం, సంబంధిత కోర్టుల ముందస్తు అనుమతి లేకుండా వాటిని పోస్ట్ చేయడం, ఎడిట్ చేయడం లేదా రీ-పోస్ట్ చేయడంపై మధ్యంతర స్టే విధిస్తూ సంచలన ఆదేశాలు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపింది. సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ లేదా ఆయా హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్ ముందస్తు అనుమతి లేకుండా విచారణల వీడియోలను ఎక్స్‌ట్రాక్ట్ చేయడం, మార్పులు చేయడం, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం లేదా వాటి ద్వారా ఆదాయం పొందడం పూర్తిగా నిషిద్ధమని స్పష్టం చేసింది. అయితే ఈ ఉత్తర్వులు సాధారణ వార్తా కవరేజ్ లేదా జర్నలిజం రిపోర్టింగ్‌పై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపవని, ఇవి భావవ్యక్తీకరణ స్వేచ్ఛను అడ్డుకునే ఉత్తర్వులు కాదని ధర్మాసనం తెలిపింది. విచారణ క్లిప్‌లు వైరల్ కావడంపై వివరణ ఇవ్వాలని మెటా, ఎక్స్ సహా పలు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి మాట్లాడుతూ... కోర్టులు 24 గంటల ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెళ్లు కావు అని స్పష్టం చేశారు. వర్చువల్ లింక్‌లు దుర్వినియోగం కాకుండా పరిమిత యాక్సెస్ మాత్రమే ఉండాలని అభిప్రాయపడ్డారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ... ఏఐ టూల్స్ ఉపయోగించి న్యాయమూర్తులు లేదా లాయర్ల మాటలను మార్చి మార్ఫింగ్ చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.


VANGS
GLOBAL TECHNOLOGIES LLP
POWERING
NEWS
DIGITALLY
Smart CMS & Digital Solutions
for Modern News Businesses
DAILY NEWS
World | Business | Finance | Lifestyle | Sport | Technology | Weather
Global economy shows signs of recovery
NEWS
Home World Politics Business Tech Sports Entertainment
Latest News
Global Economy Shows Signs of Recovery
Featured
NEWS
Top Stories Latest India World
Global Economy Shows Signs of Recovery
Latest News
NEWS
1 News Paper CMS
Manage, publish & distribute newspapers efficiently with our powerful CMS.
2 News Website CMS
Create dynamic, fast & SEO-friendly news websites with ease.
3 Mobile App Development
Engage your audience on the go with feature-rich news mobile apps.
Fast & Reliable
Secure & Scalable
Responsive Design
Easy to Use & Manage
VANGS GLOBAL TECHNOLOGIES
Contact: +91 76750 87378
NEWS
News Paper CMS
News Website CMS
Mobile App Development

వయ్యారి చిత్రం







## 'శ్రీనివాస మంగాపురం'కు యూ/ఏ

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు సోదరుడు రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా నటించిన 'శ్రీనివాస మంగాపురం' సినిమాకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రం జులై 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ కథానాయికగా నటిస్తూ తెలుగు చిత్రసీమకు పరిచయమవుతోంది. తిరుపతి నేపథ్యంగా సాగే ఈ ప్రేమకథలో వాసుబాబు, మంగా అనే ఇద్దరు స్నేహితులు ప్రేమికులుగా మారిన తర్వాత వారి జీవితంలో ఎదురయ్యే అనూహ్య పరిణామాల చుట్టూ కథ సాగుతుంది. 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' చిత్రాలతో గుర్తింపు పొందిన అజయ్ భూపతి ఈ చిత్రాన్ని తెరకెక్కించడంతో సినిమాపై అంచనాలను పెంచింది. అలాగే సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్‌బాబు వారసత్వాన్ని కొనసాగిస్తూ జయకృష్ణ ఘట్టమనేని హీరోగా వెండితెరకు పరిచయం కానుండడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ చిత్రంలో మోహన్‌బాబు ప్రతినాయకుడి పాత్రలో నటించారు. అశ్వినీదత్ సమర్పణలో చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు.

## రామాయణ ట్రైలర్ విడుదల వాయిదా

'రామాయణం' చిత్రం ట్రైలర్ విడుదల వాయిదా పడింది. అంతర్జాతీయ పంపిణీ హక్కుల నిమిత్తం ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఒప్పందం కుదరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈ పరిణామంతో శుక్రవారం ఉదయం విడుదల కావాల్సిన ట్రైలర్ నిలిచిపోయింది. భారతీయ ఇతిహాసం రామాయణాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల వద్దకు చేర్చాలన్న తన కల ఈ భాగస్వామ్యంతో సాకారమవుతోందని నమిత్ మల్హోత్రా సామాజిక మాధ్యమాల వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఇదొక




విశేషమైన సందర్భమని, అందుకే ట్రైలర్‌ను త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా ఏకకాలంలో విడుదల చేస్తామని ఆయన వివరించారు. అయితే, కొత్త విడుదల తేదీని చిత్ర బృందం ఇంకా ఖరారు చేయలేదు. ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తుండగా, సన్నీ డియోల్, రవి దూబే కీలక పాత్రల్లో పోషిస్తున్నారు. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డీఎన్ఈజీ, యశ్ నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం సుమారు రూ.4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది.

## ప్రేమ కథలో మౌనీరాయ్

బాలీవుడ్ హాట్ బ్యూటీ మౌనీ రాయ్ కెరీర్‌లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నప్పటికీ.. సినిమాలకు గ్యాప్ ఇవ్వకుండా వరుస ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్నారు. ఇటీవల రొమాంటిక్ కామెడీ మూవీ 'హై జవానీ తో ఇష్క్ హోనా హై'తో మెప్పించిన ఆమె ఇప్పుడు ఓ అందమైన ప్రేమకథతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నో అద్భుతమైన సినిమాలను అందించిన సీనియర్ దర్శకుడు సురేష్ కృష్ణ తెరకెక్కిస్తున్నారు. చాలా కాలం తర్వాత ఆయన మళ్లీ రొమాంటిక్ జానర్‌లోకి రీ-ఎంట్రీ ఇస్తుండటం విశేషం. నిర్మాత ప్రేరణ అరోరా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, మౌనీ రాయ్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించనున్నారు. ఈ కథను వినిపించిన వెంటనే మౌనీ రాయ్ ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఈ సందర్భంగా మేకర్స్ వెల్లడించారు. ఇక మూవీ దర్శకుడు సురేష్ కృష్ణ మాట్లాడుతూ.. "ఈ కథలోని ముఖ్యమైన పాత్ర భావోద్వేగాలను, అందాన్ని సమర్థవంతంగా చూపించగల నటి కావాలని అనుకున్నాం. అందుకు మౌనీ రాయ్ సరిగ్గా సరిపోతారని భావించాం. ఆమె అద్భుతమైన ప్రతిభ ఉన్న నటి. మౌనీ రాకతో ఈ సినిమా స్థాయి మరింత పెరిగింది" అని ప్రశంసించారు. సోషల్ మీడియా యుగంలో సాగే ఈ కాలపు యంగ్ అండ్ బ్యూటిఫుల్ లవ్ స్టోరీగా ఈ సినిమా ఉండబోతోందని నిర్మాత ప్రేరణ అరోరా తెలిపారు. మౌనీ రాయ్ ఈ సినిమాలో నటించడం ద్వారా ప్రాజెక్ట్‌కు ప్రత్యేకమైన క్రేజ్ వచ్చిందని, కథ వినగానే ఆమె ఎంతో ఉత్సాహంగా ఒప్పుకున్నారని చెప్పారు. ఇందులో ప్రేక్షకులు ఊహించని ఎన్నో సర్ ప్రైజ్‌లు ఉండబోతున్నాయని వెల్లడించారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ సినిమాకి సంబంధించిన షూటింగ్ త్వరలోనే ప్రారంభించనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.





## బెదిరింపులకు భయపడను

దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న నీట్ పరీక్ష లీకేజీ అక్రమాలపై విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తున్న విషయం తెలిసిందే. వారి పోరాటానికి ఎంతోమంది రాజకీయ నాయకులు, సినీ సెలబ్రిటీలు మద్దతుగా నిలుస్తున్న విషయం తెలిసిందే. గత కొద్ది రోజులుగా ఈ విషయం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఎంతోమంది ప్రాణాలు కోల్పోతూ తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ ఉద్యమం కొనసాగిస్తున్నారు. తాజాగా, విద్యార్థులకు మద్దతుగా మాట్లాడినందుకు ఓ హీరోయిన్ చిక్కుల్లో పడింది. బాలీవుడ్ బ్యూటీ ఆయేషా ఖాన్‌ను ముంబై పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ముంబైలోని దాదర్‌లో జరుగుతున్న విద్యార్థుల నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు ఆయేషా తన సోదరుడు, స్నేహితులతో కలిసి వెళ్లారు. నిరసన ప్రారంభం కాకముందే రంగంలోకి దిగిన పోలీసులు, ఆమెను బలవంతంగా ఈడ్చుకెళ్లి వోర్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. దీనిపై ఓ నెటిజన్ స్పందిస్తూ, "ఈ ఘటన తర్వాత నీకు బాలీవుడ్‌లో ఎలాంటి అవకాశాలు రావు" అని కామెంట్ చేశారు. ఆ నెటిజన్‌కు ఆయేషా ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. తన ఆత్మగౌరవాన్ని కోల్పోవడం కంటే కెరీర్‌ను వదులుకోవడానికే తాను సిద్ధంగా ఉన్నానని, ఇలాంటి బెదిరింపులు వేరేవరికైనా ఉపయోగించుకోవాలని భయపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.



## మహేశ్-రాజమౌళి సినిమాకు 'వారణాసి' టైటిల్ ఖరారు

సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించి ఒక కీలక అడ్డంకి తొలగిపోయింది. ఈ సినిమా కోసం పరిశీలిస్తున్న 'వారణాసి' టైటిల్‌పై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ఈ టైటిల్‌ను గతంలోనే తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో రిజిస్టర్ చేయించుకున్న దర్శకుడు సుబ్బారెడ్డి, చిత్ర యూనిట్ కోరిక మేరకు దానిని స్వచ్ఛందంగా వదులుకున్నారు. వివరాల్లోకి వెళ్తే, మహేశ్-రాజమౌళి ప్రాజెక్ట్ కోసం 'వారణాసి' అనే టైటిల్‌ను ఖరారు చేయాలని భావించినప్పటికీ, అది అప్పటికే సుబ్బారెడ్డి పేరు మీద నమోదై ఉంది. అయితే, ఈ భారీ చిత్రం పట్ల తనకున్న అభిమానంతో ఆయన ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా టైటిల్ హక్కులను వదులుకుంటున్నట్లు ప్రకటించారు.

## శార్వరికి మరో బిగ్ ప్రాజెక్ట్



బాలీవుడ్‌లో వరుస హిట్లు, విభిన్న పాత్రలతో దూసుకుపోతున్న యంగ్ బ్యూటీ శార్వరి వాఘ్ ఇటీవల ఆల్ఫా, మెయిన్ వాపర్ ఆవుంగా వంటి చిత్రాలతో మెప్పించారు. అంతేకాకుండా ఈ రెండు సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శార్వరి నటనకు మంచి మార్కులే పడ్డాయి. ఫుల్ జోష్‌లో ఉన్న ఆమె ఖాతాలో మరో భారీ ప్రాజెక్ట్ చేరింది. 'సుల్తాన్', 'టైగర్ జిందా హై' లాంటి భారీ బ్లాక్‌బస్టర్లు తీసిన ప్రముఖ దర్శకుడు అలీ అబ్బాస్ జఫర్ దర్శకత్వంలో రాబోతున్న ఓ క్రేజీ యాక్షన్ రోమాంటిక్ చిత్రంలో శార్వరి హీరోయిన్‌గా కనిపించబోతుండటం విశేషం. టైటిల్ ఖరారు కానీ ఈ సినిమాను యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శార్వరి విభిన్నమైన రోల్‌లో కనిపించబోతున్నట్లు టాక్. ప్రేమకథతో పాటు అదిరిపోయే యాక్షన్ ఎలిమెంట్స్ ఉన్న ఈ చిత్రంలో ఆమె పాత్ర చాలా కీలకమని, ఆమె చేసే యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ లండన్ పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. ఇందులో 'సైయారా' ఫేమ్ అహాన్ పాండే హీరోగా నటిస్తున్నారు.

ఈవార్తలు
క్రీడావాణి SPORTS
శనివారం 25-7-2026, జగిత్యాల
www.evarthalu.com




## హాఫ్ సెంచరీ ఆత్మవిశ్వాసాన్నిచ్చింది

భారత క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ సరికొత్త చరిత్ర సృష్టించాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన ఈ యువ సంచలనం తన అద్భుతమైన బ్యాటింగ్‌తో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. జింబాబ్వేతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో మెరుపు హాఫ్ సెంచరీ సాధించి, అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన వైభవ్, కేవలం 19 బంతుల్లోనే 50 పరుగులు పూర్తి చేసి తన తొలి అంతర్జాతీయ అర్ధశతకాన్ని నమోదు చేశాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్‌తో వైభవ్ సూర్యవంశీ దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 37 ఏళ్ల రికార్డును అధిగమించాడు. 1989లో పాకిస్థాన్‌పై సచిన్ తన 16 ఏళ్ల 213 రోజుల వయసులో టెస్టుల్లో హాఫ్ సెంచరీ సాధించగా, ఇప్పుడు వైభవ్ అంతకంటే తక్కువ వయసులోనే ఈ మైలురాయిని అందుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో పిన్న వయసులో హాఫ్ సెంచరీ చేసిన రికార్డు గతంలో నేపాల్ ఆటగాడు కుశాల్ మల్లా పేరిట ఉండేది. 2020లో అతను 15 ఏళ్ల 340 రోజుల వయసులో వన్డేల్లో ఈ ఫీట్ సాధించగా, ఇప్పుడు వైభవ్ ఆ రికార్డును బద్దలు కొట్టాడు. మ్యాచ్ అనంతరం 'బీసీసీఐ.టీవీ'తో మాట్లాడుతూ వైభవ్ తన ఆనందాన్ని పంచుకున్నాడు. "కెరీర్ ప్రారంభ దశలోనే ఇలాంటి ఇన్నింగ్స్‌లు ఆడితే, రాబోయే మ్యాచ్‌లకు ఆత్మవిశ్వాసం బాగా పెరుగుతుంది. ఈ రోజు నేను నా జోన్‌లో ఉన్నట్లు అనిపించింది. నా బలాన్ని నమ్ముకుని ఆడాను. ఈ హాఫ్ సెంచరీని నా కుటుంబానికి, కోచ్‌లకు, నా ప్రయాణంలో కష్టసుఖాల్లో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ అంకితమిస్తున్నాను" అని చెప్పాడు.



## భారత్‌లో యాషెస్ టెస్టు మ్యాచ్

ఇండియా, ఆస్ట్రేలియా మధ్య క్రీడా సంబంధాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే బిగ్ బాష్ లీగ్ 2026 నేపథ్యంలో తొలి మ్యాచ్ చెన్నైలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరగనుంది. ఈ మేరకు ఇప్పటికే ప్రకటన కూడా వచ్చింది. అయితే యాషెస్ సిరీస్ మ్యాచ్ లు కూడా ఇండియాలో జరిగే అవకాశాలు ఉన్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ యాషెస్ సిరీస్ లో భాగంగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లు తలపడతాయి. వాస్తవానికి ఈ టోర్నమెంట్ జరిగితే, ఆస్ట్రేలియా లేదా ఇంగ్లాండ్ లో నిర్వహించాలి. కానీ త్వరలో జరగబోయే యాషెస్ సిరీస్ ను ఇండియాలో నిర్వహించేలా సన్నద్ధం అవుతున్నారట. ఈ మేరకు క్రికెట్ ఆస్ట్రేలియా పరిశీలన చేస్తున్నట్లు సమాచారం అందుతోంది. దీనిపై క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ టాడ్ గ్రీన్ బర్గ్ మాట్లాడుతూ ఇండియాలో యాషెస్ సిరీస్ నిర్వహించడంపై అన్ని ఆప్షన్లను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. ఇంగ్లాండ్ తో పాటు బీసీసీఐతో కూడా తమకు మంచి సంబంధాలు ఉన్నాయని వివరించారు. ఇండియాలో యాషెస్ సిరీస్ నిర్వహించే దానిపైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అన్ని కుదిరితే కచ్చితంగా జరుగుతుందని వివరించారు. యాషెస్ సిరీస్ లో ఒక్క టెస్ట్ అయినా నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నట్లు వివరించారు.





## సెమీస్‌కు భారత స్విమ్మర్

గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత స్విమ్మర్ శ్రీహరి నటరాజ్ సత్తా చాటాడు. పురుషుల 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో సెమీఫైనల్‌లో అడుగుపెట్టాడు. శుక్రవారం జరిగిన హీట్స్‌లో శ్రీహరి 25.52 సెకన్లలో రేసును పూర్తి చేసి సంయుక్తంగా 14వ స్థానంలో నిలిచాడు. బెర్ముడాకు చెందిన జాక్ హార్వేతో సమాన సమయాన్ని నమోదు చేసిన నటరాజ్.. టాప్-16లో చోటు దక్కించుకుని సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్నాడు. ఎనిమిది మంది పాల్గొన్న ఈ హీట్‌లో శ్రీహరి ఐదో స్థానంలో నిలిచాడు. రెండు ఒలింపిక్స్‌లో పాల్గొన్న ఈ భారత స్విమ్మర్.. ఇప్పటికే పలు జాతీయ రికార్డులు తన పేరిట నమోదు చేసుకున్న సంగతి తెలిసిందే. పారా స్విమ్మింగ్ 100 మీటర్ల ఫ్రీస్టైల్ ఎస్13 విభాగంలో భారత క్రీడాకారులు ఆర్‌వీవీబీకే బుడిగినా, ఇమామ్ అలీ ఫైనల్‌కు అర్హత సాధించారు. ఈ విభాగంలో హీట్స్‌లో పాల్గొన్న ఎనిమిది మంది ఆటగాళ్లూ ఫైనల్‌కు చేరడం విశేషం. బుడిగినా 57.10 సెకన్ల టైమింగ్‌తో హీట్స్‌లో మూడో స్థానంలో నిలవగా.. ఇమామ్ అలీ 1:05.32 సెకన్లతో చివరి స్థానంలో ఉన్నాడు. కాగా, ఎస్13 విభాగం దృష్టి లోపం ఉన్న అథ్లెట్ల కోసం నిర్వహించే పారా స్విమ్మింగ్ కేటగిరీ.



## అదరగొట్టండి: ప్రధాని మోదీ

కామన్వెల్త్ గేమ్స్ సందర్భంగా సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విట్టర్) లో ప్రధాని నరేంద్ర మోడీ స్పందిస్తూ.. కామన్వెల్త్ 2026 క్రీడలు ప్రారంభమవుతున్న సందర్భంగా భారత బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు.. మన క్రీడాకారులు ఎంతో పట్టుదల, క్రీడా స్ఫూర్తి, నిబద్ధతతో పోటీల్లో రాణిస్తారనే నమ్మకం నాకు ఉంది. మన అథ్లెట్ల నైపుణ్యం, అంకితభావం ఎల్లప్పుడూ కోట్లాది మంది భారతీయులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.



## శ్రేయస్.. వరుసగా 8 టాస్‌లు విన్!

అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో టాస్ గెలవడంలో భారత్ నయా సారథి శ్రేయస్ అయ్యర్ సరికొత్త చరిత్ర సృష్టించాడు! కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి ఎనిమిది మ్యాచ్‌ల్లోనూ వరుసగా ఎనిమిది సార్లు టాస్ గెలిచిన ప్రపంచంలోనే ఏకైక సారథిగా అరుదైన వరల్డ్ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. గతంలో బహామాస్ కెప్టెన్ గ్రెగొరీ టేలర్ (7 సార్లు) పేరిట ఉన్న అంతర్జాతీయ రికార్డును శ్రేయస్ అధిగమించాడు. అంతేకాకుండా, గతంలో టీమ్ ఇండియా కెప్టెన్‌గా ఎంఎస్ ధోనీ (2010-2012 మధ్య వరుసగా 7 టాస్‌లు) నెలకొల్పిన రికార్డును కూడా అయ్యర్ చెరిపివేశాడు. ఈ అరుదైన లక్కీ రికార్డుతో పాటు, సుదీర్ఘకాలంగా వెంటాడుతున్న ఓటముల పరంపరకు తెరదించుతూ కెప్టెన్‌గా తన మొదటి విజయాన్ని కూడా అయ్యర్ ఆస్వాదించాడు. హరారేలో జింబాబ్వేతో జరిగిన తొలి టీ20లో టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న భారత్, ప్రత్యర్థిని 125/7 పరుగులకే పరిమితం చేసింది. భారత యువ పేసర్ మయాంక్ యాదవ్ (2/18) నిప్పులు చెరిగే బంతులతో జింబాబ్వే బ్యాటర్లను వణికించి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. అనంతరం 126 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు 15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ ఊహకందని ధమాకా ఇచ్చాడు. కేవలం 18 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీ సాధించి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పేశాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28 నాటౌట్), ఇషాన్ కిషన్ (35) సమయోచితంగా రాణించడంతో భారత్ కేవలం 13.2 ఓవర్లలోనే 7 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది.



## మెస్సీ వీడ్కోలుకు ఏర్పాట్లు?

అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న లియోనెల్ మెస్సీ తన అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకడానికి సిద్ధమవుతున్నాడు. 2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో అర్జెంటీనా ఓటమి పాలైన తర్వాత తన భవిష్యత్తుపై మౌనం వహించిన మెస్సీ, ఇప్పుడు రిటైర్మెంట్ వైపు మొగ్గు చూపుతున్నట్టు అర్జెంటీనా మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ వార్త ఫుట్‌బాల్ ప్రపంచంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ కథనాల ప్రకారం.. మెస్సీ మరో ప్రపంచకప్‌లో ఆడే ఆలోచనలో లేడు. అయితే, జట్టులో యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేస్తూ, సాఫీగా మార్పులు జరిగేందుకు వీలుగా మరికొన్ని నెలల పాటు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. అదే సమయంలో అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏఎఫ్ఏ) మెస్సీకి ఘనంగా వీడ్కోలు పలికేందుకు ఒక ప్రత్యేక, భారీ వీడ్కోలు మ్యాచ్‌ను నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ మ్యాచ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న అభిమానులు తమ హీరోకు అద్భుతమైన వీడ్కోలు ఇచ్చే అవకాశం లభిస్తుందని ఓ స్పోర్ట్స్ చానల్ తన కథనంలో పేర్కొంది.



## ధోనీ సలహా పనిచేసింది

టీమిండియా వికెట్ కీపర్-బ్యాటర్ సంజూ శాంసన్ తన ఐపీఎల్ కెరీర్‌కు సంబంధించి ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. 11 ఏళ్ల పాటు సుదీర్ఘ అనుబంధం ఉన్న రాజస్థాన్ రాయల్స్‌ను వీడటం ఒక భారీ రిస్క్ అని, అయితే చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరడం వల్ల తనలో కొత్త శక్తి పుట్టుకొచ్చిందని అన్నాడు. జియోస్టార్ 'సూపర్ స్టార్స్' కార్యక్రమంలో మాట్లాడుతూ సంజూ ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. రాజస్థాన్ రాయల్స్‌తో తన బంధంపై సంజూ మాట్లాడుతూ.. "రాజస్థాన్ రాయల్స్‌ను వీడటం చాలా పెద్ద రిస్క్. ఒకసారి ఫ్రాంచైజీకి మీ మనసులో మాట చెప్పాక, వెనక్కి వెళ్లే మార్గం ఉండదు. ఈ నిర్ణయం వెనుక రెండు కారణాలున్నాయి. మొదటిది, 2025 సీజనే ఆర్‌ఆర్‌తో నాకు చివరిదని నేను నిశ్చయించుకున్నా. నా కుటుంబం, నా భార్యతో సుదీర్ఘంగా చర్చించాను. ఇది ఆవేశపూరిత నిర్ణయమా? అని వాళ్లు అడిగారు. కానీ రెండు, మూడు వారాల చర్చల తర్వాత.. ఇదే సరైన సమయమని నిర్ణయించుకున్నా. రెండోది, నాపై నాకు పూర్తి నమ్మకం ఉంది. సున్నా నుంచి మళ్లీ ప్రారంభించడానికి నేను ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను. చెపాక్ లాంటి నెమ్మదైన వికెట్‌పై నా బ్యాటింగ్ శైలి సరిపోదని చాలామంది అన్నారు. కానీ, 'నీకు 30 ఏళ్లు. ఏదో ఒక మార్గం కనుక్కో' అని నాకు నేను చెప్పుకున్నాను. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఏదో సాధించాలనే పట్టుదలతో, కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగాను" అని వివరించాడు. 2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచినప్పటికీ, సీఎస్‌కే తరఫున ఆడిన మొదటి మూడు మ్యాచ్ లలో సంజూ విఫలమయ్యాడు. ఆ సమయంలో జట్టు యాజమాన్యం నుంచి లభించిన మద్దతు, ముఖ్యంగా ఎంఎస్ ధోనీ ఇచ్చిన సలహా తనను ఎలా మార్చిందో సంజూ గుర్తుచేసుకున్నాడు. "టీ20 క్రికెట్‌లో వైఫల్యాలు సహజం. నేను సీఎస్‌కేలో చేరినప్పుడు మొదటి మూడు మ్యాచ్ లలో విఫలమయ్యాను. మేం ఆ మూడు మ్యాచ్ లూ ఓడిపోయాం. ప్రపంచకప్ ఫైనల్ ఆడిన ఫామ్‌ను కొనసాగించలేకపోయాను. అలాంటి స్థితిలో కోచ్, కెప్టెన్, మహీ భాయ్ అందరూ మనవైపే చూస్తారని తెలుసు. అయితే, జట్టు యాజమాన్యం, సహచరుల నుంచి నా పట్ల స్పందనలో ఒక్క శాతం కూడా మార్పు రాలేదు. నాపై వారి నమ్మకం తగ్గలేదు. అది నాకు చాలా బలాన్నిచ్చింది. ప్రాక్టీస్ సెషన్‌లో మహీ భాయ్ నా దగ్గరకు వచ్చి 'బాగున్నావా?' అని అడిగారు. నేను 'ఫైన్ భయ్యా' అన్నాను. కానీ, నా సమాధానంలో 'కానీ, అయితే' లాంటి మాటలు దొర్లాయి.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# డిజిటల్ యుగం.. నిజమెంత?

ఒకప్పుడు వార్తలను తెలుసుకోవడానికి పత్రికలు, రేడియో, టెలివిజన్ వంటి సంప్రదాయ మాధ్యమాలపై ప్రజలు ఆధారపడేవారు. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటే ప్రపంచం అరచేతిలో ఉన్నట్టే. ఒక సంఘటన జరిగిన క్షణాల్లోనే లక్షలాది మందికి సమాచారం చేరుతోంది. ఈ వేగానికి కారణం సోషల్ మీడియా. కానీ ఇదే వేగం నిజమైన సమాచారాన్ని ఎంత త్వరగా వ్యాప్తి చేస్తుందో, అపసమాచారాన్ని కూడా అంతే వేగంగా వ్యాప్తి చేస్తోంది. అందుకే నేడు అత్యంత కీలకమైన ప్రశ్న.. సోషల్ మీడియా నిజంగా సమాచార వేదికా? లేక అపసమాచారానికి కేంద్రంగా మారుతోందా? ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి వేదికలు ప్రపంచవ్యాప్తంగా సమాచార ప్రసారాన్ని విప్లవాత్మకంగా మార్చేశాయి. ప్రతి వ్యక్తి ఇప్పుడు కేవలం సమాచారాన్ని స్వీకరించే వ్యక్తి మాత్రమే కాదు; సమాచారాన్ని సృష్టించే, ప్రచారం చేసే వ్యక్తిగా కూడా మారిపోయాడు. ఈ ప్రజాస్వామ్యీకరణ వల్ల ఎన్నో మంచి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు, రక్తదానం, ప్రకృతి వైపరీత్యాల సమాచారం, ప్రభుత్వ పథకాల ప్రచారం, విద్య, ఆరోగ్య అవగాహన, చిన్న వ్యాపారాల ప్రోత్సాహం వంటి అనేక రంగాల్లో సోషల్ మీడియా విశేషమైన పాత్ర పోషిస్తోంది. అయితే ప్రతి సాంకేతిక పరిజ్ఞానంలాగే సోషల్ మీడియాకు కూడా మరో కోణం ఉంది. అదే అపసమాచారం, దుష్ప్రచారం. నిర్ధారణ లేని వార్తలు, పాత వీడియోలను కొత్తవిగా ప్రచారం చేయడం, ఫోటోలను మార్ఫింగ్ చేయడం, కృత్రిమ మేధ సాయంతో డీప్‌ఫేక్ వీడియోలు రూపొందించడం, తప్పుడు గణాంకాలు, కల్పిత కథనాలు, మత, కుల, రాజకీయ విద్వేషాన్ని రెచ్చగొట్టే పోస్టులు.. ఇవన్నీ సమాజంలో గందరగోళానికి కారణమవుతున్నాయి. ఈ సమస్యలో అత్యంత ప్రమాదకరమైన అంశం ఏమిటంటే, అపసమాచారం నిజంలా కనిపించడం. మంచి ఎడిటింగ్, ఆకర్షణీయమైన గ్రాఫిక్స్, అధికారిక లోగోలు, కృత్రిమ మేధతో తయారైన వీడియోలు చూసినప్పుడు సాధారణ ప్రజలు వాటిని సులభంగా నమ్మే అవకాశం ఉంది. ఒకప్పుడు ఫోటో చూస్తే అది నిజమే అనుకునేవారు. ఇప్పుడు ఫోటో, వీడియో, ఆడియో కూడా పూర్తిగా నమ్మదగిన ఆధారాలుగా పరిగణించలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇటీవలి కాలంలో ఎన్నికలు, ప్రకృతి వైపరీత్యాలు, ఆరోగ్య అత్యవసర పరిస్థితులు, మతపరమైన ఉద్రిక్తతలు వంటి సందర్భాల్లో తప్పుడు సమాచారం వేగంగా వ్యాపించడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. కొన్ని సందర్భాల్లో వదంతుల కారణంగా సామాజిక ఉద్రిక్తతలు, ఆర్థిక నష్టాలు, ప్రజల్లో భయాందోళనలు కూడా ఏర్పడ్డాయి. అంటే సోషల్ మీడియా కేవలం వినోద వేదిక మాత్రమే కాదు; అది ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే శక్తివంతమైన సాధనంగా మారింది. దీనికి మరో కారణం ఆల్గోరిథమ్ ఆధారిత సమాచార వ్యవస్థ. సోషల్ మీడియా వేదికలు మనం ఇష్టపడే విషయాలనే ఎక్కువగా చూపిస్తాయి. ఫలితంగా మన అభిప్రాయాలకు అనుకూలమైన సమాచారమే ఎక్కువగా కనిపిస్తుంది. దీనినే "ఎకో ఛాంబర్" అంటారు. భిన్నమైన అభిప్రాయాలు కనిపించకపోవడం వల్ల సమాజంలో విభజనలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. సోషల్ మీడియా వల్ల సంప్రదాయ జర్నలిజం కూడా కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. గతంలో ఒక వార్త ప్రచురించడానికి ముందు అనేక స్థాయిల్లో నిర్ధారణ, సంపాదకీయం, చట్టపరమైన పరిశీలన జరిగేది. ఇప్పుడు "ముందుగా పోస్ట్ చేయాలి" అనే పోటీ పెరగడంతో నిర్ధారణ కంటే వేగానికి ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ పరిస్థితిలో బాధ్యతాయుతమైన జర్నలిజం మరింత కీలకంగా మారింది. అయితే మొత్తం బాధ్యతను సోషల్ మీడియా సంస్థలపైనే వేయలేం. వినియోగదారుల పాత్ర కూడా అంతే ముఖ్యం. ప్రతి సందేశాన్ని వెంటనే ఫార్వర్డ్ చేయడం, మూలం తెలియని వీడియోలను నిజమని నమ్మడం, శీర్షిక మాత్రమే చదివి అభిప్రాయం ఏర్పరచుకోవడం వంటి అలవాట్లు అపసమాచారం వ్యాప్తికి దోహదం చేస్తున్నాయి. అందుకే డిజిటల్ యుగంలో ప్రతి పౌరుడు డిజిటల్ అక్షరాస్యత పెంపొందించుకోవాలి. ఏ సమాచారం వచ్చినా కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. ఈ సమాచారం ఎక్కడి నుంచి వచ్చింది? విశ్వసనీయ వార్తా సంస్థలు కూడా ఇదే విషయాన్ని ప్రచురించాయా? వీడియో ఎప్పుడు తీసింది? ఫోటో అసలుదా? భావోద్వేగాలను రెచ్చగొట్టేలా ఉందా? ఆధారాలు ఉన్నాయా? ఈ చిన్న పరిశీలనే అనేక వదంతులను అడ్డుకోగలదు. ప్రభుత్వాల పాత్ర కూడా కీలకం. అపసమాచారాన్ని అరికట్టేందుకు చట్టాలు అవసరమే. కానీ ఆ పేరుతో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు అనవసర పరిమితులు విధించకుండా సమతుల్య దృక్పథంతో వ్యవహరించాలి. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛా భావ వ్యక్తీకరణ ఎంత ముఖ్యమో, బాధ్యతాయుతమైన సమాచార ప్రసారం కూడా అంతే ముఖ్యం. విద్యాసంస్థలు కూడా డిజిటల్ మీడియా అవగాహనను పాఠ్యాంశాల్లో భాగం చేయాలి. విద్యార్థులకు వార్తల నిర్ధారణ, వాస్తవ నిర్ధారణ, సైబర్ భద్రత, ఏఐ ద్వారా సృష్టించిన కంటెంట్‌ను గుర్తించే నైపుణ్యాలను నేర్పాలి. రాబోయే కాలంలో ఇది చదవడం, రాయడం తెలిసినంత అవసరమైన నైపుణ్యంగా మారబోతోంది. కృత్రిమ మేధ అభివృద్ధితో ఈ సవాళ్లు మరింత పెరగనున్నాయి. నిజమైన వ్యక్తి మాట్లాడనప్పటికీ మాట్లాడినట్టుగా కనిపించే వీడియోలు, జరగని సంఘటనలను జరిగినట్టుగా చూపించే చిత్రాలు, నకిలీ వార్తా కథనాలు తయారు చేయడం సులభమవుతోంది. కాబట్టి భవిష్యత్తులో "చూసాను కాబట్టి నిజం" అనే భావనకు బదులుగా "నిర్ధారించాను కాబట్టి నిజం" అనే సంస్కృతి అలవర్చుకోవాల్సిన అవసరం ఉంది. సోషల్ మీడియాను శత్రువుగా చూడాల్సిన అవసరం లేదు. అదే సమయంలో అది చెప్పే ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మడం కూడా ప్రమాదకరం. ఇది ఒక శక్తివంతమైన సాధనం. దాన్ని ఎలా ఉపయోగిస్తామన్నదే సమాజంపై దాని ప్రభావాన్ని నిర్ణయిస్తుంది. సమాచారం ప్రజాస్వామ్యానికి ప్రాణం. అపసమాచారం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. ఒక బాధ్యతాయుతమైన పౌరుడు ప్రతి సందేశాన్ని ఫార్వర్డ్ చేసే ముందు ఒకసారి ఆలోచిస్తే, ప్రతి వార్తను నమ్మే ముందు ఒకసారి నిర్ధారించుకుంటే, ప్రతి అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ముందు ఒకసారి బాధ్యతను గుర్తిస్తే సోషల్ మీడియా అపసమాచారానికి వేదిక కాకుండా జ్ఞానానికి, ప్రజాస్వామ్యానికి, సమాజ అభివృద్ధికి శక్తివంతమైన సాధనంగా నిలుస్తుంది. డిజిటల్ యుగంలో వేగం కంటే వాస్తవమే విలువైనది.

"మూడో ప్రపంచ యుద్ధం చమురు కోసం కాదు.. నీటి కోసం జరిగే అవకాశం ఉంది" అనే హెచ్చరికను ప్రపంచంలోని అనేక విధాన నిపుణులు, పర్యావరణవేత్తలు చాలాకాలంగా చేస్తున్నారు. ఇది అతిశయోక్తి కాదని ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ఒకప్పుడు నీటి కొరత అనేది ఎడారి దేశాల సమస్యగా భావించేవారు. కానీ నేడు నీటి సంక్షోభం ప్రపంచంలోని దాదాపు ప్రతి దేశాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. వాతావరణ మార్పులు, జనాభా పెరుగుదల, పట్టణీకరణ, భూగర్భ జలాల విచక్షణారహిత వినియోగం, నదుల కాలుష్యం, అడవుల నరికివేత..

ఇవన్నీ కలిసి నీటిని 21వ శతాబ్దంలో అత్యంత విలువైన సహజ వనరుగా మార్చేశాయి. భారతదేశ పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ప్రపంచ జనాభాలో సుమారు 18 శాతం మంది భారతదేశంలో నివసిస్తుంటే, ప్రపంచ మంచినీటి వనరుల్లో మన వాటా కేవలం 4 శాతం మాత్రమే. ఈ పరిమిత నీటితోనే వ్యవసాయం, పరిశ్రమలు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి, పర్యావరణ అవసరాలను తీర్చాల్సి వస్తోంది. జనాభా పెరుగుతుండగా నీటి లభ్యత మాత్రం తగ్గుతోంది. ఫలితంగా నీరు క్రమంగా వ్యూహాత్మక వనరుగా మారుతోంది.



# రేపటి నీటి యుద్ధాలు

*ఒకప్పుడు గ్రామాల్లో మాత్రమే కనిపించిన నీటి కొరత నేడు మహానగరాలకూ చేరుకుంది. వేసవి ప్రారంభం కాకముందే అనేక నగరాల్లో బోర్‌వెల్లు ఎండిపోవడం, ట్యాంకర్లపై ఆధారపడటం, తాగునీటి సరఫరాకు పరిమితులు విధించడం సాధారణమైపోయింది. నీటి కోసం కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లే గ్రామీణ మహిళల దృశ్యాలు ఇప్పటికీ దేశంలోని అనేక ప్రాంతాల్లో కనిపిస్తూనే ఉన్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో నీటి కోసం సామాజిక ఘర్షణలు పెరిగే ప్రమాదం ఉంది. నీటి సమస్యకు ప్రధాన కారణాల్లో ఒకటి భూగర్భ జలాల అధిక వినియోగం.*



- వెంకటేశ్ గుగ్గిళ్ల,
ఈవార్తలు దినపత్రిక
రిపోర్టర్

విద్యుత్ సబ్సిడీలు, లోతైన బోర్‌వెల్ సాంకేతికత అందుబాటులోకి రావడంతో అనేక ప్రాంతాల్లో భూగర్భ జలాలను విచక్షణారహితంగా తోడేస్తున్నారు. వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గిపోవడంతో ప్రతి ఏడాది భూగర్భ జలమట్టం దిగజారుతోంది. కొన్ని ప్రాంతాల్లో వందల అడుగుల లోతులో కూడా నీరు దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇది కేవలం రైతుల సమస్య కాదు; తాగునీటి భద్రతకూ పెద్ద సవాలు. వ్యవసాయం దేశంలో అత్యధిక నీటిని వినియోగించే రంగం. వరి, చెరకు వంటి అధిక నీటి అవసరమున్న పంటలను నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా సాగు చేయడం వల్ల నీటి వనరులపై ఒత్తిడి పెరుగుతోంది. సూక్ష్మ సేద్యం, డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులు, పంటల వైవిధ్యీకరణ, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే వ్యవసాయ పద్ధతులను మరింత విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. "ప్రతి చుక్క – ప్రతి పంట" అనే సూత్రాన్ని ఆచరణలో పెట్టాలి. వాతావరణ మార్పులు కూడా నీటి సంక్షోభాన్ని మరింత తీవ్రమవుతున్నాయి. వర్షపాతం అనిశ్చితంగా మారుతోంది. ఒకేసారి భారీ వర్షాలు కురవడం, మిగతా కాలంలో దీర్ఘకాలం వర్షాభావం కొనసాగడం కొత్త సాధారణ పరిస్థితిగా మారుతోంది. వరదల రూపంలో కోట్లాది క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తుండగా, కొద్ది నెలలకే తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇది ప్రకృతి వైపరీత్యం కంటే నీటి నిర్వహణలో ఉన్న లోపాలనే ఎక్కువగా సూచిస్తోంది.

నదుల కాలుష్యం మరో పెద్ద ప్రమాదం. పరిశ్రమల వ్యర్థాలు, శుద్ధి చేయని మురుగునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయన ఎరువుల అవశేషాలు నదులు, చెరువులు, సరస్సులను కలుషితం చేస్తున్నాయి. నీరు ఉన్నా ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. "నీటి కొరత"తో పాటు "శుద్ధమైన నీటి కొరత" కూడా పెద్ద సవాలుగా మారుతోంది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సమస్య స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణలో చెరువుల పునరుద్ధరణ, భారీ సాగునీటి ప్రాజెక్టులు చేపట్టినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలపై ఆధారపడటం ఇంకా ఎక్కువగానే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా వంటి నదులు ఉన్నప్పటికీ, రాయలసీమ వంటి ప్రాంతాలు ఇప్పటికీ నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. అంతర్రాష్ట్ర జల వివాదాలు కూడా నీటి విలువ ఎంత పెరిగిందో తెలియజేస్తున్నాయి. భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు జరుగుతాయని చెప్పినప్పుడు చాలామంది దేశాల మధ్య యుద్ధాలనే ఊహిస్తారు. కానీ నీటి ఘర్షణలు గ్రామాల మధ్య, జిల్లాల మధ్య, రాష్ట్రాల మధ్య, వ్యవసాయం--పరిశ్రమల మధ్య, పట్టణం--గ్రామం మధ్య కూడా పెరిగే అవకాశం ఉంది. నీటి వనరుల సమన్యాయ పంపిణీ, సమర్థవంతమైన నిర్వహణ లేకపోతే ఈ ఘర్షణలు మరింత తీవ్రమవుతాయి. ఈ పరిస్థితిని మార్చడానికి ప్రభుత్వాలే కాదు, ప్రతి పౌరుడు కూడా బాధ్యత వహించాలి. ప్రతి ఇంటిలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ తప్పనిసరి చేయాలి. నగరాల్లో వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయాలి. చెరువులు, కుంటలు, కాలువలు, వాగులను ఆక్రమణల నుంచి కాపాడాలి. ప్రతి గ్రామంలో వాటర్ బడ్జెట్ రూపొందించి ఎంత నీరు అందుబాటులో ఉంది, ఎంత వినియోగించాలి అనే ప్రణాళిక రూపొందించాలి. మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమలు, ఉద్యానవనాలు, నిర్మాణ రంగంలో తిరిగి వినియోగించాలి. పరిశ్రమలు కూడా "నీటి వినియోగ సామర్థ్యం" పెంచే సాంకేతికతలను అవలంబించాలి. పునర్వినియోగం (=వఎఎశ్రీవ), తిరిగి వినియోగం (=వబంవ), వర్షపు నీటి సంరక్షణ వంటి చర్యలను తప్పనిసరిగా అమలు చేయాలి. నగర ప్రణాళికలో చెరువులు, సరస్సులు, జలమార్గాలను కాపాడటం అభివృద్ధిలో భాగంగా ఉండాలి. పాఠశాల స్థాయి నుంచే నీటి విలువను పిల్లలకు బోధించాలి. విద్యుత్‌ను ఆదా చేయమని చెప్పినట్లే నీటిని ఆదా చేయడం కూడా జీవన విధానంలో భాగం కావాలి. ఇంట్లో లీకేజీలు సరిచేయడం, అవసరానికి మించి నీటిని వృథా చేయకపోవడం, చెట్లను నాటడం, స్థానిక జల వనరులను పరిరక్షించడం వంటి చిన్న చర్యలు కూడా పెద్ద ఫలితాలను ఇస్తాయి. అభివృద్ధి అంటే కేవలం భారీ ప్రాజెక్టులు నిర్మించడం కాదు; భావితరాలకు నీటిని భద్రపరచడం కూడా. ఈ రోజు మనం వృథా చేస్తున్న ప్రతి నీటి చుక్క రేపటి తరాల హక్కును హరిస్తోంది. భూమి మనకు పూర్వీకులు ఇచ్చిన వారసత్వం కాదు; భావితరాల నుంచి తీసుకున్న అప్పు. ఆ అప్పును నీటి రూపంలో వారికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. నీటి కోసం యుద్ధాలు జరగకుండా ఆపే శక్తి ఆయుధాల్లో లేదు; అవగాహనలో ఉంది. ఆనకట్టల నిర్మాణం మాత్రమే కాదు, ప్రతి ఇంట్లో నీటి సంరక్షణ సంస్కృతి ఏర్పడాలి. ప్రతి చుక్కను ఆదా చేయడం అంటే కేవలం నీటిని కాదు, మన భవిష్యత్తును కాపాడుకోవడమే. ఇప్పుడే చర్యలు తీసుకుంటే రేపటి తరాలకు దాహం కాదు, సురక్షితమైన జీవనాధారం అందించగలం.



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR**from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004